thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com


RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 214 | జగిత్యాల బుధవారం 18 నవంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

లక్నో గూటికి సామ్ కర్రన్
ఢిల్లీ జట్టులో భారీ ప్రక్షాళన!



11



ఖరీదైన మద్యం సీసాల్లో
చీప్ లిక్కర్

- క్యాబ్ డ్రైవర్ ఇంట్లో కల్తీ మద్యం తయారీ కేంద్రం
- జానీ వాకర్, డీవర్స్, 100 పైపర్స్ సీసాల్లో చీప్ లిక్కర్ నింపి విక్రయం
- 10 ఫుల్ బాటిళ్లు, 30కిపైగా ఖాళీ సీసాలు స్వాధీనం

2

- ఇద్దరు నిందితుల అరెస్ట్..
- మరో పది మంది కొనుగోలుదారులపై నిఘా



రియల్ ఎస్టేట్ సంస్థలకు
రెరా షాక్!

- నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణ సంస్థలపై కొరడా
- సనాలి ఐటీ పార్క్‌కు రూ.25 లక్షల భారీ జరిమానా
- వడ్డీతో సొమ్ము తిరిగి చెల్లించాలని ఆదేశాలు
- అరైన్ ఇన్‌ఫ్రా ఫ్లాట్ వెంటనే అప్పగించాలని స్పష్టీకరణ
- ఆదేశాలు బేఖాతరు చేస్తే మరిన్ని జరిమానాలు

2



ఛత్తీస్‌గఢ్ సీఎంకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

సమ్మక్క సాగర్‌కు అనుమతులివ్వండి!

- రాయ్‌పూర్‌లో విష్ణుదేవ్ సాయితో కీలక భేటీ
- నిరభ్యంతర పత్రం త్వరగా జారీ చేస్తామని హామీ
- ప్రాజెక్టుతో ఛత్తీస్‌గఢ్‌లో ముంపు కేవలం 33 ఎకరాలే
- 6.94 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో సమ్మక్క సాగర్
- గిరిజన, వెనుకబడిన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలే లక్ష్యం

ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన బహుళ ప్రయోజనాల సమ్మక్క సాగర్ బ్యారేజీకి వెంటనే నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని కోరారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ప్రాధాన్యం, ముంపు ప్రభావం, నీటి నిల్వ అవసరాలను వివరించారు. ఈ విజ్ఞప్తిపై ఛత్తీస్‌గఢ్ సీఎం సానుకూలంగా స్పందించి ఎన్‌ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది.

రాయ్‌పూర్, నవంబర్ 17 (చురకలు): ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన బహుళ ప్రయోజనాల 'సమ్మక్క సాగర్' బ్యారేజీని పూర్తి చేయడానికి వెంటనే నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయిని కోరారు. మంగళవారం రాయ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ సీఎంను కలిసి ఈ అంశంపై సమగ్రంగా చర్చించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని వివరాలను వారికి వివరించారు. ఈ భేటీలో ఛత్తీస్‌గఢ్ సీఎం సానుకూలంగా స్పందించారని, ఎన్‌ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మిగతా 2 లో



దాడికి ముందే రెక్కీ..

- సీఆర్‌పీఎఫ్ బలగాలపై దాడికి ముందే పక్కాప్రణాళిక
- సీసీ కెమెరాల్లో ఉగ్రవాదుల కదలికలు!
- ఎదురుకాల్పుల్లో ఉమర్ నిసార్ దార్ హతం

4

గర్ల్‌ఫ్రెండ్‌తో రెస్టారెంట్‌కు..

- అమ్మానాన్న తొలిసారి కలుసుకున్న చోటుకే ప్రేయసితో..
- జ్ఞాపకాలను పంచుకున్న రాహుల్ గాంధీ





పోటీ కాదు.. సహకారమే
మన భవిష్యత్తు!

- భారత్-ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ పిలుపు
- ప్రపంచ జనాభాలో నాలుగో వంతుకు ప్రాతినిధ్యం
- శాంతి, స్థిరత్వం, సమష్టి అభివృద్ధే లక్ష్యం

4

భారత్-ఆసియాన్ దేశాల కూటమి కలిసి ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, కాబట్టి మన ఉమ్మడి భవిష్యత్తును కేవలం పోటీ కాకుండా పరస్పర సహకారమే నిర్దేశించాలని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మంగళవారం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన ఇండియా-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో 11 సభ్య దేశాల నేతలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

రాజన్న ఆలయం వద్ద ఉద్రిక్తత



- ప్రధాన గోపుర శిఖరం తొలగింపుపై దుమారం
- ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా పనులు చేపట్టారంటూ బీజేపీ ఆందోళన
- ఆలయ అభివృద్ధి పనులు నిలిపివేయాలని డిమాండ్
- ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

2

వెంటిలేటర్‌పైకి విద్యావ్యవస్థ!



- ఇంటర్ బోర్డు రద్దు నిర్ణయంపై కవిత తీవ్ర ఆగ్రహం
- విద్యార్థుల స్థానికత హక్కులకు ముప్పు ఉందని ఆరోపణ
- కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేసేందుకేనని విమర్శ



మూసీ సుందరీకరణ అవసరమా?


సీఎంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

3

బధిర మహిళపై
గ్యాంగ్ రేప్

- అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో ఇద్దరి అరెస్ట్!
- తల్లిదండ్రులకు అనారోగ్యమంటూ నమ్మించి దారుణం

2



విద్యుత్ వినియోగంలో
ఆల్‌టైమ్ రికార్డు

- తొలిసారిగా 20 వేల మెగావాట్లు దాటిన గరిష్ఠ డిమాండ్
- రెండు కొత్త సబ్‌స్టేషన్లు ప్రారంభం..
- రబీకి ముందస్తు ఏర్పాట్లు
- ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

2





ఖరీదైన మద్యం సీసాల్లో చీప్ లిక్కర్

క్యాబ్ డ్రైవర్ ఇంట్లో కల్తీ మద్యం తయారీ కేంద్రం

జానీ వాకర్, డీవర్స్, 100 పైపర్స్ సీసాల్లో చీప్ లిక్కర్ నింపి విక్రయం

10 ఫుల్ బాటిళ్లు, 30కిపైగా ఖాళీ సీసాలు స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్ట్.. మరో పది మంది కొనుగోలుదారులపై నిఘా

హైదరాబాద్, నవంబర్ 17 (చురకలు): క్యాబ్ డ్రైవర్ ముసుగులో కల్తీ మద్యం దందా సాగిస్తున్న ఇద్దరు వ్యక్తులను గ్రేటర్ హైదరాబాద్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ (డీటీఎఫ్) పోలీసులు అరెస్ట్ చేశారు. తక్కువ ధరకు లభించే మద్యాన్ని ఖరీదైన విదేశీ బ్రాండ్ల ఖాళీ సీసాల్లో నింపి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుల నుంచి కల్తీ చేసిన 10 ఫుల్ బాటిళ్లతోపాటు 30కిపైగా ఖాళీ ఖరీదైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వంగలి అశోక్ (43) గతంలో బగ్గా డిస్టిలరీలో పనిచేశాడు. ఆరు నెలల క్రితం ఆ ఉద్యోగం మానేసి క్యాబ్ డ్రైవర్‌గా మారాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో శంషాబాద్ శాతమ్రాయిలోని తన నివాసంలో కల్తీ మద్యం తయారీ, విక్రయాలు ప్రారంభించాడు. మహమ్మద్ యాకూబ్ పాషా (29) నిర్వహిస్తున్న స్క్రాప్ దుకాణం నుంచి ప్రముఖ బ్రాండ్ల ఖాళీ మద్యం సీసాలను అశోక్ కొనుగోలు చేసేవాడు. వాటిని శుభ్రం చేసి, మూతలను జాగ్రత్తగా తొలగించి, ఒక్కో సీసాలో రూ.560 విలువైన డౌన్‌టౌన్ వంటి చౌక మద్యాన్ని నింపేవాడు. జానీ వాకర్, డీవర్స్, 100 పైపర్స్ వంటి ఖరీదైన బ్రాండ్ల పేరుతో ఈ మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నాడు. ఈ అక్రమ వ్యాపారంపై సమాచారం అందుకున్న కానిస్టేబుల్ ధనుంజయ్.. డీటీఎఫ్ సీఐ నరేందర్‌కు వివరాలు అందించారు. దీంతో నరేందర్ నేతృత్వంలోని బృందం శాతమ్రాయిలోని అశోక్ నివాసంపై ఆకస్మికంగా దాడి చేసింది. అక్కడ కల్తీ మద్యం బాటిళ్లు, ఖాళీ సీసాలను స్వాధీనం చేసుకుని అశోక్‌ను అదుపులోకి తీసుకుంది. అతడు వెల్లడించిన సమాచారం ఆధారంగా ఖాళీ సీసాలు సరఫరా చేస్తున్న స్క్రాప్ దుకాణం యజమాని యాకూబ్ పాషాను కూడా అరెస్ట్ చేశారు. నిందితులు ఈ మద్యాన్ని స్థానికంగా సుమారు పది మందికి విక్రయించినట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. వారిని కూడా త్వరలో అదుపులోకి తీసుకుని విచారించనున్నట్లు తెలిపారు. అరెస్టయిన ఇద్దరితోపాటు స్వాధీనం చేసుకున్న మద్యాన్ని తదుపరి చర్యల కోసం శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఎస్సైలు హనుమంతు, నజీర్ పాషా, ఇన్‌ఛార్జి సీఐ భరత్‌కుమార్, సిబ్బంది ధనుంజయ్, అభినయ్, కిషన్, భాస్కర్ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ సంస్థలకు రెరా షాక్!

నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణ సంస్థలపై కొరడా

సనాలి ఐటీ పార్క్‌కు రూ.25 లక్షల భారీ జరిమానా



హైదరాబాద్, నవంబర్ 17 (చురకలు): రియల్ ఎస్టేట్ రంగంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్న నిర్మాణ సంస్థలపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) కఠిన చర్యలు చేపట్టింది. ప్రాజెక్టుల పేరుతో కొనుగోలుదారుల నుంచి భారీగా సొమ్ము వసూలు చేసి, నిర్మాణాలు పూర్తి చేయడంలో జాప్యం చేయడం, ఫ్లాట్లు అప్పగించకపోవడం, రిఫండ్ హామీలను నెరవేర్చకపోవడంపై స్పందించింది. నిబంధనలు పాటించని సంస్థలకు జరిమానాలు విధించడంతోపాటు, కొనుగోలుదారులకు వడ్డీతో సహా డబ్బులు తిరిగి చెల్లించాలని ఆదేశించింది. మంచిరేవులలో రెరా రిజిస్ట్రేషన్ లేకుండానే 'సనాలి ది ఎడ్జ్' ప్రాజెక్టును ప్రచారం చేస్తున్న సనాలి ఐటీ పార్క్ సంస్థపై అథారిటీ చర్యలు తీసుకుంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు రూ.25 లక్షల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని 30 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించింది. రెరా రిజిస్ట్రేషన్ పొందే వరకు ప్రాజెక్టుకు సంబంధించిన ప్రకటనలు, బుకింగ్‌లు, విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని స్పష్టం చేసింది. కొనుగోలుదారులకు చెల్లించాల్సిన సొమ్మును తిరిగి ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన సంస్థలకూ రెరా ఆదేశాలు జారీ చేసింది. వాసవి రియల్టర్స్ ఎల్ఎల్పీ రూ.49.50 లక్షలను ఏడాదికి 10.85 శాతం వడ్డీతో సహా చెల్లించాలని పేర్కొంది. త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ రూ.41.85 లక్షలు, ఎస్‌వీఎం ఆదిత్య హోమ్స్ రూ.27.16 లక్షలు, భువన తేజ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ రూ.26 లక్షలు, ఆదిత్య స్క్వేర్స్ రూ.17 లక్షలు, బీవీఆర్ ఇన్‌ఫ్రా రూ.7 లక్షలను సంబంధిత కొనుగోలుదారులకు వడ్డీతో సహా తిరిగి ఇవ్వాలని ఆదేశించింది. మియాపూర్‌లోని 'అరైన్ ఎమరాల్డ్' ప్రాజెక్టులో ఫ్లాట్ నంబర్ 502ను కొనుగోలుదారుడికి వెంటనే అప్పగించాలని అరైన్ ఇన్‌ఫ్రా సంస్థను ఆదేశించింది. ఈ ఆదేశాలను అమలు చేయకపోయినా, ఉల్లంఘించినా రెరా చట్టంలోని సెక్షన్ 63 ప్రకారం అదనపు జరిమానాలతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తాజా నిర్ణయాలతో నిర్మాణ సంస్థల బాధ్యతను నిర్ధారించడంలో, కొనుగోలుదారుల హక్కులను కాపాడడంలో తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది.

సమ్మక్క సాగర్‌కు అనుమతులివ్వండి!

మొదటి పేజీ తరువాయి

ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో భవిష్యత్తు నీటి అవసరాలు భారీగా పెరిగే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సమ్మక్క సాగర్ బ్యారేజీలో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతినివ్వాలని, ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన అనుమతుల సాధనలోనూ సహకరించాలని కోరారు. తొలుత కాంతనపల్లి వద్ద ఈ ప్రాజెక్టును ప్రతిపాదించగా.. 11,408 ఎకరాల భూమి, 17 ఆదివాసీ గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని గుర్తించి, ఆ ముంపు ప్రభావాన్ని తగ్గించేందుకే నిర్మాణ ప్రదేశాన్ని తుపాకులగూడెంకు మార్చినట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన రూ. 9.883 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఏప్రిల్‌లోనే చెల్లించిందని గుర్తుచేశారు. ఈ మేరకు ఐఐటీ ఖరగ్‌పూర్ తన సమగ్ర అధ్యయన నివేదికను జూలై 30నే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించిందని పేర్కొన్నారు. తుపాకులగూడెం వద్ద నిర్మించడం వల్ల ఛత్తీస్‌గఢ్‌లో కేవలం 33 ఎకరాలు మాత్రమే ముంపునకు గురవుతాయని, అత్యంత భారీ వరదల సమయంలో కూడా ఈ ప్రభావం వంద ఎకరాలకు మించదని ఆ నివేదికలో స్పష్టమైందని తెలిపారు. ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. ఈ బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం +83 మీటర్ల వద్ద దీని నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలుగా ఉంది. కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాల కోసం గోదావరి జలాలను వినియోగించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూములకు సంబంధించి భూసేకరణ, నష్టపరిహారం, పునరావాసానికి అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం పూర్తిగా చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినందున, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎన్ఓసీని వీలైనంత త్వరగా జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.



విద్యుత్ వినియోగంలో ఆల్‌టైమ్ రికార్డు

- తొలిసారిగా 20 వేల మెగావాట్లు దాటిన గరిష్ఠ డిమాండ్
- రెండు కొత్త సబ్‌స్టేషన్లు ప్రారంభం..
- రబీకి ముందస్తు ఏర్పాట్లు
- ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్, నవంబర్ 17 (చురకలు): తెలంగాణ విద్యుత్ రంగంలో సరికొత్త రికార్డు నమోదైంది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్ల స్థాయిని అధిగమించింది. సోమవారం (నవంబర్ 16) రాష్ట్రవ్యాప్తంగా 20,018 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదై ఆల్‌టైమ్ రికార్డుగా నిలిచింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, జలవిద్యుత్ ఉత్పత్తిలో సుమారు 4 వేల మెగావాట్ల లోటు ఉన్నప్పటికీ పెరిగిన అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసినట్లు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. గతేడాది నవంబర్ 16న 8,522 మెగావాట్లుగా నమోదైన విద్యుత్ డిమాండ్ ఈ ఏడాది అదే తేదీన 12,802 మెగావాట్లకు పెరిగిందని మంత్రి తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే 50.2 శాతం వృద్ధి నమోదైందని, అదనంగా 4,280 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేసినట్లు వివరించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా తెలంగాణ పవర్ రిపోర్ట్ గణాంకాలను వెల్లడించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇందులో భాగంగా దావూద్‌ఖాన్‌గూడ, బడంగ్‌పేట్ ప్రాంతాల్లో కొత్తగా నిర్మించిన రెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. వీటి ద్వారా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నాణ్యత మెరుగుపడటంతోపాటు పంపిణీ సామర్థ్యం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న రబీ 2026--27 సీజన్‌లో వ్యవసాయ రంగానికి విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ లభ్యత, డిమాండ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. గృహాలు, వ్యవసాయ రంగం, పరిశ్రమలకు ఎలాంటి అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

వేములవాడ రాజన్న ఆలయం వద్ద ఉద్రిక్తత

- ప్రధాన గోపుర శిఖరం తొలగింపుపై దుమారం
- ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా పనులంటూ బీజేపీ ఆందోళన
- ఆలయ అభివృద్ధి పనులు నిలిపివేయాలని డిమాండ్
- ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



వేములవాడ/సిరిసిల్ల, నవంబర్ 17 (చురకలు): దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి, విస్తరణ పనులు తీవ్ర వివాదానికి, ఉద్రిక్తతకు దారితీశాయి. మంగళవారం ప్రధాన ఆలయ గోపుర శిఖరం తొలగింపు ప్రక్రియ చేపట్టడం స్థానికంగా కలకలం రేపింది. ఆగమ శాస్త్ర నియమాలకు విరుద్ధంగా, భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా గోపుర శిఖరాన్ని తొలగిస్తున్నారని ఆరోపిస్తూ స్థానిక బీజేపీ నాయకులు ఆలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఆలయ అభివృద్ధి పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేతలకు పాల్పడుతోందని మండిపడుతూ, తలుపులు నెట్టివేసి లోపలికి వెళ్లేందుకు యత్నించారు. వెంటనే వీటీడీఏ అధికారులు, కలెక్టర్ సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని వివరించాలని డినాదాలు చేశారు. ఈ నిరసనలతో రాజన్న ఆలయ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో.. సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డిబోయిన గోపి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి పనుల పేరుతో ప్రాచీన కట్టడాలు, ఆగమ సంప్రదాయాలకు నష్టం కలిగించవద్దని డిమాండ్ చేశారు. రాజన్న ఆలయం ఎవరి వ్యక్తిగత జాగీరు కాదని, కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవమని స్పష్టం చేశారు. గర్భగుడిని ముట్టుకోబోమని గతంలో చెప్పిన అధికారులు, ఇప్పుడు గర్భగుడి శిఖరాన్ని తొలగించే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. శిఖరం తొలగింపునకు ఎవరు అనుమతి ఇచ్చారు? శృంగేరి పీఠం నుంచి లిఖితపూర్వక అనుమతులు తీసుకున్నారా? అని నిలదీశారు. అనుమతులు ఉంటే వాటిని ప్రజలకు ఎందుకు వెల్లడించడం లేదని ప్రశ్నించారు. స్లాబ్ నిర్మాణం వల్ల శిఖరం కనిపించని పరిస్థితి ఏర్పడటానికి కారణాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు, ఖర్చులు, కాంట్రాక్టర్ల వివరాలను బహిర్గతం చేయాలన్నారు. దక్షిణామూర్తి విగ్రహం, వెయ్యి స్తంభాల మండపం వంటి ప్రాచీన కట్టడాల పరిరక్షణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ విషయాలపై వాస్తవాలు తెలుసుకునేందుకు త్వరలో బీజేపీ నాయకులు శృంగేరి పీఠాన్ని సందర్శించి పీఠాధిపతులను కలుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు సిరికొండ శ్రీనివాస్, పొన్నాల తిరుపతిరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రెగుల సంతోష్ బాబు, కౌన్సిలర్లు వంగల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బధిర మహిళపై గ్యాంగ్ రేప్

అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో ఇద్దరి అరెస్ట్!

హైదరాబాద్, నవంబర్ 17 (చురకలు): నగర శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ బధిర మహిళపై ఇద్దరు వ్యక్తులు సామూహిక లైంగిక దాడికి పాల్పడగా.. పోలీసులు వెంటనే స్పందించి నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో నివసించే ఓ బధిర మహిళను నిందితులు అత్యంత దారుణంగా మోసగించారు. మీ తల్లిదండ్రులకు తీవ్ర అనారోగ్యంగా ఉందని, వెంటనే చూడటానికి వెళ్లాలంటూ ఆమెను నమ్మించి ఆటోలో ఎక్కించుకున్నారు. అయితే తల్లిదండ్రుల వద్దకు కాకుండా ఆమెను ఓ నిర్మానుష్య ప్రాంతానికి బలవంతంగా తరలించారు. అక్కడ ఆమెపై ఇద్దరు నిందితులు సామూహిక లైంగిక దాడికి పాల్పడి పరారయ్యారు. ఈ అఘాయిత్యంతో తీవ్ర మనస్తాపానికి, ఆవేదనకు గురైన బాధితురాలు.. ధైర్యం చేసి కుటుంబ సభ్యుల సహాయంతో నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. బధిర మహిళపై అరాచకానికి పాల్పడిన ఘటనను తీవ్రంగా పరిగణించిన పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుల ఆచూకీని వేగంగా గుర్తించారు. నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని స్పష్టం చేశారు.

కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా!

ఈ నెల 19న సిద్దిపేటలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

అన్ని బీమా పథకాలను ఒకే గొడుగు కిందకు తేవాలి



హైదరాబాద్, నవంబర్ 17 (చురకలు): ఈ నెల 19న సిద్దిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఇందిరమ్మ బీమా దరఖాస్తుల స్వీకరణ, ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా అమలయ్యేలా పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పథకంలో భాగంగా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. దీనివల్ల ఉపాధి హామీ కూలీలతో పాటు రాష్ట్రంలోని లక్షలాది మంది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ఇప్పటికే అమలవుతున్న వివిధ రకాల బీమా పథకాల్లో జీవిత బీమా కింద రూ. 2 లక్షలు, ప్రమాద బీమా కింద రూ. 10 లక్షల వరకు అందిస్తున్నట్లు సమావేశంలో అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం.. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న బీమా పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని, ప్రస్తుతం వారికి అందుతున్న ప్రమాద బీమా ప్రయోజనాలను యథాతథంగా కొనసాగించాలని సూచించారు. కొన్ని శాఖల్లో ప్రస్తుతం ఉన్న రూ. 2 లక్షల జీవిత బీమాను ఇందిరమ్మ బీమా పరిధిలోకి తెచ్చి రూ. 5 లక్షలకు పెంచాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి బీమా భద్రత అందుకుంటున్న వారిలో ఏ ఒక్కరినీ మినహాయించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. సిద్దిపేట బహిరంగ సభలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్న నేపథ్యంలో.. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పంపిణీకి వీలుగా చీరలను తక్షణమే అన్ని జిల్లాలకు తరలించాలని సూచించారు. ఇందిరమ్మ బీమా, చీరల పంపిణీ ప్రక్రియలపై జిల్లా కలెక్టర్లతో వెంటనే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. చీరల పంపిణీలో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, ఇందిరమ్మ బీమా పథకంపై విస్తృతంగా ప్రచారం కల్పించి, దరఖాస్తులను గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు.

వెంటిలేటర్‌పైకి విద్యావ్యవస్థ!

- ఇంటర్ బోర్డు రద్దు నిర్ణయంపై కవిత తీవ్ర ఆగ్రహం
- విద్యార్థుల స్థానికత హక్కులకు ముప్పు ఉందని ఆరోపణ
- కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేసేందుకేనని విమర్శ



హైదరాబాద్, నవంబర్ 17 (చురకలు): సీఎం రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ విద్యావ్యవస్థ వెంటిలేటర్‌పైకి వెళ్లిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలనలోనే విద్యారంగం సంక్షోభంలోకి వెళ్లిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిస్థితి మరింత దిగజారిందని విమర్శించారు. ఇంటర్మీడియట్ బోర్డు రద్దు నిర్ణయం వెనుక తెలంగాణ విద్యార్థుల స్థానికత హక్కులకు నష్టం కలిగించే ప్రయత్నం ఉందని ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో 'ఇంటర్ బోర్డు రద్దు-- తెలంగాణ విద్యపై ప్రభావం' అంశంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంటర్ బోర్డును రద్దు చేసి 9 నుంచి 12వ తరగతి వరకు ఒకే విధానం తీసుకురావడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యాసంస్థలకు ప్రయోజనం కల్పించే ప్రయత్నం జరుగుతోందని కవిత ఆరోపించారు. ఏపీలో ప్రవేశం పొందిన విద్యార్థులు హైదరాబాద్‌లో పరీక్షలు రాసి స్థానికులుగా గుర్తింపు పొందే ప్రమాదం ఉందన్నారు. చంద్రబాబు మెప్పు కోసమే రేవంత్ ఈ నిర్ణయం తీసుకుంటున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు నష్టం కలిగించే నిర్ణయాలను సహించబోమని హెచ్చరించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయం తీసుకునే ముందు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, రాజకీయ పార్టీలతో చర్చించారా అని ప్రశ్నించారు. ఇంటర్ బోర్డు రద్దు వల్ల జూనియర్ కళాశాలలు, అధ్యాపకుల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల చదువు మధ్యలో మానేయడాన్ని కారణంగా చూపుతూ బోర్డును రద్దు చేయడం సరికాదన్నారు. ముందు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని సూచించారు. సంస్కరణలు చేపట్టాలంటే కేరళ తరహాలో విస్తృత చర్చలు జరిపి, దశలవారీగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం బిల్లు తీసుకురావాలనుకుంటే ప్రతి జిల్లాలో ముసాయిదాను అందుబాటులో ఉంచి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానికత, పదో తరగతి ప్రాధాన్యం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ శాస్త్రీయ ఆధారాలతోనే విద్యా విధానాల్లో మార్పులు చేపట్టాలని సూచించారు. ఇంటర్ విద్య జేఏసీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్ బోర్డు రద్దుతో కలిగే ప్రయోజనాలను ప్రభుత్వం వివరించలేదన్నారు. ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ తొందరపాటు నిర్ణయాలు విద్యారంగంలో సంక్షోభానికి దారితీయవచ్చని హెచ్చరించారు. కనిష్క కోచింగ్ అకాడమీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్య ప్రభుత్వ సామాజిక బాధ్యతని, కార్పొరేటీకరణను అరికట్టాలని కోరారు. ఇంటర్ బోర్డు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఐక్య పోరాటాలు చేపడతామని కవిత హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రాలేవీ?.. రైతుల గోస పట్టదా?

- వడ్లు కొనకపోవడంతో దళారుల చేతుల్లో రైతులు నష్టపోతున్నారు
- దొడ్డు వడ్లకు దిక్కులేదు.. క్వింటాకు పది కిలోల తరుగు
- లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినా పరిహారం ఇవ్వడం లేదు
- ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం చెల్లించాలి
- యాసంగి రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలి
- కాంగ్రెస్ మూడేళ్ల పాలన నయవంచనకు నిదర్శనం
- ప్రభుత్వంపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు



సంగారెడ్డి, నవంబర్ 17 (చురకలు): రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మంగళవారం నిజాంపేట మండల కేంద్రంలో రైతులను కలిసిన ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని ప్రభుత్వం చెబుతున్నా ఒక్క గింజ కూడా కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. రైతులు 20 రోజులుగా ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులకు తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నల్లగొండ, నిజామాబాద్ సహా పలు జిల్లాల్లో సన్న వడ్లను క్వింటాకు రూ.2,600 నుంచి రూ.2,700కే విక్రయిస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. దొడ్డు వడ్లను రూ.2,200కే దళారులు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. దీనికితోడు క్వింటాకు పది కిలోల వరకు తరుగు తీస్తుండటంతో రైతులు మరింత నష్టపోతున్నారన్నారు. సన్నాలు సాగు చేయాలని ప్రోత్సహించిన ప్రభుత్వం ఇప్పుడు రైతులను ఆదుకోవడం లేదని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో కోతలు, తరుగు లేకుండా చర్యలు తీసుకోవాలని, బోనస్ చెల్లింపులపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినా ప్రభుత్వం ఇప్పటివరకు నష్టాన్ని అంచనా వేయలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నాయని, తెలంగాణలోనూ పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల పరిహారం చెల్లించాలని కోరారు. యాసంగి రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయడంతోపాటు వ్యవసాయ కూలీలకు హామీ ఇచ్చిన రూ.12 వేలు అందించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా వాయిదాలు, రుణమాఫీ, బోనస్ చెల్లింపుల్లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నారాయణఖేడ్ ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పలు తండాలకు మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదని తెలిపారు. నల్లవాగు, నిజాంసాగర్‌లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించి ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు. కరువు కారణంగా నారాయణఖేడ్, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి వలసలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో మృతిచెందిన రైతుల కుటుంబాలకు పరిహారం అందడం లేదని ఆరోపించారు. కొత్త బీమా పథకాల ప్రకటనల కంటే ఇప్పటికే అమలులో ఉన్న పథకాల ప్రయోజనాలను అర్హులకు అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మూడేళ్లుగా మోసం చేస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. అభయహస్తం పేరుతో ఇచ్చిన హామీలు చివరకు శూన్యహస్తంగా మారాయని ఎద్దేవా చేశారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథాలతో సమానంగా భావిస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఆ మాట నిలబెట్టుకోలేదన్నారు. తొలి మంత్రివర్గ సమావేశంలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారని, 38 మంత్రివర్గ సమావేశాలు జరిగినా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకుంటే ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు.

హైదరాబాద్‌ను రెండో వ్యాపార కేంద్రంగా మలచుకోండి

- తెలంగాణలో పెట్టుబడులకు గుజరాత్ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం
- డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఈవీ, ఏరోస్పేస్ రంగాల్లో అవకాశాలు
- భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా పారిశ్రామిక జోన్లు
- భారీ ప్రాజెక్టులకు 15 రోజుల్లో అనుమతులు, ప్రత్యేక అధికారి
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



అహ్మదాబాద్, నవంబర్ 17: గుజరాత్ పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాలను తెలంగాణకు విస్తరించి హైదరాబాద్‌ను దక్షిణ భారతదేశంలో మరో ప్రధాన వ్యాపార కేంద్రంగా మలచుకోవాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026లో భాగంగా ఫిక్కీతో కలిసి అహ్మదాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, అధునాతన తయారీ, ఎలక్ట్రిక్ వాహనాలు, ఏరోస్పేస్, రక్షణ, ఐటీ రంగాల్లో తెలంగాణలో విస్తృత పెట్టుబడి అవకాశాలున్నాయని తెలిపారు. గుజరాత్ నుంచి పెట్టుబడులను ఆకర్షించడం తమ ఉద్దేశం కాదని, అక్కడి వ్యాపారాలను మరింత విస్తరించుకునేందుకు తెలంగాణను మరో కేంద్రంగా ఎంచుకోవాలని సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డేటా సెంటర్లకు 1,200 ఎకరాలు, ఎలక్ట్రానిక్స్, తయారీ పరిశ్రమలకు మరో 1,200 ఎకరాలు, ఈవీ, ఇంధన నిల్వ వ్యవస్థలకు 800 ఎకరాలకు పైగా కేటాయించినట్లు వెల్లడించారు. ఏఐ సిటీ, విద్యా కేంద్రంతోపాటు 15 వేల ఎకరాలకు పైగా పచ్చదనాన్ని అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ విలువ 189 బిలియన్ డాలర్లకు చేరిందని, గత ఏడాది 10.75 శాతం వృద్ధి నమోదైందని పేర్కొన్నారు. టీజీ-ఐపాస్ ద్వారా భారీ పరిశ్రమలకు 15 రోజుల్లో అనుమతులు ఇస్తున్నామని, 98 శాతం దరఖాస్తులను గడువులోగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. గుజరాత్ నుంచి పెట్టుబడులు పెట్టే ప్రతి సంస్థకు ప్రత్యేక అధికారిని నియమించి, పరిశ్రమ ప్రారంభమయ్యే వరకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పారిశ్రామిక భూములపై 100 శాతం స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్, ఏడేళ్లపాటు 75 శాతం వరకు ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్ కల్పిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్-2047లో భాగంగా క్యూర్, ప్యూర్, రేర్ విధానాలతో పట్టణ, పట్టణ పరిసర, గ్రామీణ ప్రాంతాల్లో సమతుల్య ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. గ్లోబల్ సమ్మిట్‌లో సుమారు 100 అంతర్జాతీయ ఏరోస్పేస్, రక్షణ సంస్థల భాగస్వామ్యంతో రక్షా ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గుజరాత్, తెలంగాణ రాష్ట్రాలు పరస్పర బలాలను వినియోగించుకుని దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని శ్రీధర్‌బాబు కోరారు.



'డబుల్' ఇండ్ల ఆకస్మిక తనిఖీల సమాచారం లీక్ వ్యవహారంలో డీఈఈ సస్పెన్షన్

హైదరాబాద్, నవంబర్ 17 (చురకలు) : డబుల్ బెడ్ రూం ఇండ్లలో అసలైన లబ్ధిదారులే నివాసం ఉంటున్నారా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు హౌసింగ్ అధికారులు నిర్వహిస్తున్న ఆకస్మిక తనిఖీల సమాచారాన్ని ముందుగానే లబ్ధిదారులకు లీక్ చేసిన హౌసింగ్ కార్పొరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డీఈఈ) చంద్రపాల్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతమ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలతో నిర్మించి ఉచితంగా కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇండ్లు అర్హులైన లబ్ధిదారులకే ఉపయోగపడాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్లను ఇతరులకు అద్దెకు ఇవ్వడం, విక్రయించడం లేదా లబ్ధిదారులు నివాసం ఉండకుండా ఇతరుల ఆధీనంలో ఉంచడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఇలాంటి అక్రమ కేటాయింపులను గుర్తించి నిబంధనల ప్రకారం రద్దు చేసేందుకు నోటీసులు జారీ చేయడంతోపాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారికి కొల్లూరులో డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించినప్పటికీ చాలామంది లబ్ధిదారులు అక్కడ నివాసం ఉండటం లేదన్న ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో హౌసింగ్ అధికారులు ఇప్పటికే పలుమార్లు తనిఖీలు నిర్వహించి నివాసం ఉండని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులకు సమాధానంగా తాము కేటాయించిన ఇళ్లలోనే నివసిస్తున్నామని పలువురు లబ్ధిదారులు పేర్కొనడంతో వాస్తవ పరిస్థితిని నిర్ధారించేందుకు ఆకస్మిక తనిఖీలను మరింత విస్తృతం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో సెలవు రోజైన ఆదివారం పెద్ద ఎత్తున ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ప్రణాళిక రూపొందించారు. హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న డీఈఈ చంద్రపాల్ ఈ తనిఖీలకు సంబంధించిన సమాచారాన్ని లబ్ధిదారులకు లీక్ చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టగా తనిఖీల సమాచారం లీక్ అయినట్లు నిర్ధారణ కావడంతో విధుల్లో నిర్లక్ష్యం, అధికారిక సమాచార గోప్యతను పాటించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. దీంతో డీఈఈ చంద్రపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఎండీ ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, ప్రభుత్వ లక్ష్యాలకు విరుద్ధంగా వ్యవహరించినా, అక్రమాలకు పాల్పడినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

రాజీనే రాజమార్గం..

పోలీసు పదోన్నతులకు లైన్ క్లియర్!

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లపై డీజీపీ ఆనంద్ ప్రత్యేక చొరవ

1991, 1995, 1996 బ్యాచ్‌ల పదోన్నతి జాబితాలు సిద్ధం

హైదరాబాద్, నవంబర్ 17 (చురకలు): పోలీసు శాఖలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అధికారుల పదోన్నతుల సమస్యకు పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. సీనియారిటీ, రోస్టర్ విధానం, ఖాళీలు, అర్హతలపై నెలకొన్న వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు డీజీపీ సి.వి.ఆనంద్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కోర్టు కేసుల కారణంగా అర్హులైన అధికారులు పదోన్నతులు కోల్పోకుండా ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రయత్నించారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో 1991, 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వరంగల్, హైదరాబాద్ రేంజ్‌లతోపాటు హైదరాబాద్ నగరానికి చెందిన అధికారులు పాల్గొని పదోన్నతులపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. తొలి విడతలో 54 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పించేందుకు ఖాళీలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు వివరించారు. రెండో విడతలో 2027 ఆగస్టు నాటికి మరో 34 పోస్టులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ మేరకు మూడు బ్యాచ్‌లకు సంబంధించిన పదోన్నతి ప్యానళ్లను సిద్ధం చేశారు. గతంలో జారీ చేసిన జీవో నంబర్ 74 ప్రకారం పదోన్నతులు చేపట్టే క్రమంలో సీనియారిటీపై అభ్యంతరాలు తలెత్తడంతో ప్రక్రియ నిలిచిపోయింది. తాజా సమావేశంలో కమిటీ నివేదికలు, ప్రభుత్వ ఉత్తర్వులు, రోస్టర్ నిబంధనలను సమీక్షించి ప్రతిపాదిత జాబితాలపై అధికారుల మధ్య ఏకాభిప్రాయం సాధించారు. ప్రస్తుతం ఎలాంటి న్యాయపరమైన వివాదాలు లేని 12 నాన్ కేడర్ ఎస్పీ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. సంబంధిత ప్యానల్ సంవత్సరంలో మరో 10 పోస్టులు కేటాయించే అవకాశం ఉందన్నారు. అందుబాటులో ఉన్న ఖాళీలు, అర్హతలు, సీనియారిటీ, రోస్టర్ వివరాలను డీజీపీ కార్యాలయ అధికారులు దృశ్య ప్రదర్శన ద్వారా వివరించారు. ప్రతిపాదిత పదోన్నతి జాబితాల ప్రకారం ముందుకు వెళ్లేందుకు సమావేశంలో పాల్గొన్న అధికారులు అంగీకారం తెలిపారు. సమావేశంలో కుదిరిన ఏకాభిప్రాయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేస్తామని డీజీపీ ఆనంద్ తెలిపారు. వివాదాలు, కోర్టు కేసులు దీర్ఘకాలం కొనసాగితే ముఖ్యంగా పదవీ విరమణకు చేరువలో ఉన్న అధికారులు నష్టపోతారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి అధికారికి నిబంధనల ప్రకారం న్యాయం జరగాలన్నదే పోలీసు శాఖ లక్ష్యమని స్పష్టం చేశారు. సమావేశంలో మహిళా భద్రతా విభాగం డీజీ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ ఎం.భగవత్, అదనపు డీజీలు అకున్ సబర్వాల్, విజయ్‌కుమార్, ఐజీలు షానవాజ్ ఖాసీం, కార్తికేయ, చందనా దీప్తి తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



సంపాదకీయం



అభివృద్ధి అంకెల వెనుక.. అంతుచిక్కని సామాన్యుడి వ్యథ!

ఒకవైపు దేశ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా దూసుకుపోతోందంటూ పాలకుల గొప్పలు.. ఇంకోవైపు కిరాణా కొట్టులో సరుకుల ధరలు చూసి గుండె గుభేల్మంటున్న సగటు మనిషి బతుకు! పత్రికల్లో అచ్చయ్యే ప్రగతి గణాంకాలకు, సామాన్యుడి ఇంట్లో నెలాఖరుకు మిగిలే చిల్లర పైసలకు మధ్య ఎక్కడా పొంతన కుదరని దుస్థితి ఇది. ఆకాశాన్ని అంటుతున్న ధరల మంటలో మధ్యతరగతి బతుకు నిశ్శబ్దంగా కాలిపోతోంది. నెల మొదటి రోజున చేతికొచ్చిన జీతం చూసి మురిసిపోవాలా.. లేక నెలాఖరు వరకు ఆ జీతంతో బండి ఎలా లాగాలన్న ఆందోళనతో కుమిలిపోవాలా అన్నది నేటి సామాన్య కుటుంబాల దయనీయ పరిస్థితి. ఒకప్పుడు కనీస అవసరాలు తీర్చుకుని భవిష్యత్తు కోసం కనీసం కొద్దిపాటైనా పొదుపు చేసుకునే కుటుంబాలు.. ఇప్పుడు ఏ ఖర్చును కోత కోసుకుంటే బతుకు బండి సాగుతుందోనని రోజూ లెక్కలు వేసుకుంటున్నాయి. కాగితాలపై కనిపిస్తున్న ఆర్థిక వికాసం నిజ జీవితంలో ఎందుకు సాక్షాత్కరించడం లేదన్నదే ఇప్పుడు సమాజాన్ని తొలుస్తున్న అతిపెద్ద ప్రశ్న.

గణాంకాలకే పరిమితమైన ప్రగతి..

నిత్యావసరాల ధరల పెరుగుదల తీవ్రత ఏ స్థాయిలో ఉందన్నది తాజా ప్రభుత్వ లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. అక్టోబర్ 2026 నాటికి దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 6.09 శాతానికి చేరుకోగా, ఆహార ద్రవ్యోల్బణం ఏకంగా 8.94 శాతంగా నమోదైంది. గత నెలతో పోలిస్తే ఇది అత్యంత ఆందోళనకరమైన పెరుగుదల. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సామాన్య ద్రవ్యోల్బణం 6.63 శాతంగా ఉండటం పల్లె బతుకులపై పడుతున్న భారాన్ని కళ్లకు కడుతోంది. ఏసీ గదుల్లో కూర్చుని లెక్కలు కట్టే ఆర్థికవేత్తలకు ఈ శాతాలు సులువుగానే అర్థం కావొచ్చు. కానీ కూలీనాలీ చేసుకునే సామాన్యుడికి ఈ అంకెల గారడీతో పనేంటి? వంద రూపాయలు పట్టుకెళ్తే మార్కెట్‌లో కూరగాయల సంచి ఎందుకు నిండటం లేదన్నదే అతని అసలైన ఆవేదన. నెలకు సరిపడే సరుకులు పదిహేను రోజులకే ఎందుకు అడుగంటుతున్నాయి? పిల్లల చదువు, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీ, ఇంటి అద్దె, కరెంటు బిల్లు, ప్రయాణ ఖర్చులు, చేసిన అప్పులకు నెలవారీ వాయిదాలు చెల్లించిన తర్వాత.. చేతిలో చిల్లిగవ్వ ఎందుకు మిగలడం లేదు? అన్నదే అతను ప్రతిక్షణం అనుభవిస్తున్న నిజమైన ద్రవ్యోల్బణం.

ఆదాయం ఆవగింజ.. ఖర్చులు కొండంత!

ఉద్యోగికి వార్షిక వేతన పెంపు పేరుతో ఏటా కాస్తో కూస్తో జీతం పెరిగినా.. అదే సమయంలో నిత్యావసరాలు, విద్య, వైద్యం, రవాణా ఖర్చులు అంతకు మించి రెట్టింపు వేగంగా పెరిగితే ఆ పెంపునకు అర్థమేముంటుంది? అంకెల రూపంలో జీతం పెరగడం ముఖ్యం కాదు.. ఆ జీతంతో కొనగలిగే వస్తువుల పరిమాణం పెరగడమే నిజమైన ఆర్థిక భద్రత. నేటి మధ్యతరగతి కుటుంబాలు చదువు, వైద్యం లాంటి అత్యవసరాల కోసం చేసే ఖర్చు భరించలేక నానా అవస్థలు పడుతున్నాయి. ఏ చిన్న కష్టం వచ్చినా అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిన దుస్థితి నెలకొంది. పొదుపు అన్న పదం సామాన్యుడి నిఘంటువులో నుంచి శాశ్వతంగా కనుమరుగవుతోంది.

రైతుకు, వినియోగదారుడికి.. ఇద్దరికీ అన్యాయమే..

ధరల పెరుగుదలపై చర్చించేటప్పుడు దేశానికి అన్నం పెడుతున్న రైతును విస్మరించడం ఏమాత్రం సరికాదు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు రైతుకు కనీస గిట్టుబాటు ధర దక్కడం లేదు. అదే సమయంలో ఆ పంటను కొనుక్కుని తినే వినియోగదారుడికి సరసమైన ధరకు ఆహారం అందడం లేదు. వాస్తవానికి ఇక్కడ లాభపడుతున్నది కేవలం మధ్యవర్తులే. రైతు వద్ద అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి, అదే సరుకును వినియోగదారుడికి అమాంతం పెంచేసి విక్రయిస్తున్న దళారీ వ్యవస్థను అరికట్టడంలో ప్రభుత్వాలు దారుణంగా విఫలమవుతున్నాయి. మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించే అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలి. ధరలు ఆకాశాన్ని అంటిన తర్వాత ఉత్తుత్తి సమీక్షలు చేసి చేతులు దులుపుకోవడం కాదు.. ముందస్తుగానే ధరలను అదుపు చేసే పటిష్టమైన యంత్రాంగం కావాలి.

అసలైన అభివృద్ధి కొలమానం అదే..

లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి.. జీడీపీ అంకెలు పరుగులు తీస్తున్నాయి.. అన్న ప్రభుత్వాల ప్రకటనలు పైకి వినసొంపుగానే ఉండొచ్చు. కానీ నెల జీతం తీసుకునే ఓ సామాన్య కుటుంబం నెలాఖరుకు కనీసం కాస్తయినా మిగుల్చుకోగలుగుతోందా? అన్న ప్రశ్నకు పాలకుల వద్ద కచ్చితమైన సమాధానం ఉండాలి. ఆ సమాధానం ప్రతికూలంగా ఉంటే.. అసలు ఈ అభివృద్ధి ఫలాలు సమాజంలో ఎవరికి అందుతున్నాయన్న ప్రశ్న తలెత్తక మానదు. ప్రభుత్వాలు ధరల నియంత్రణను కేవలం ఒక ఆర్థిక విధానంగా మాత్రమే చూడకూడదు. దానిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. సామాన్యుడి జీతం కాగితంపై ఎంత పెరిగిందన్నది కాదు.. ఆ వచ్చిన జీతంతో అతని కుటుంబం సమాజంలో ఎంత గౌరవంగా బతకగలుగుతోందా అన్నదే అసలు సిసలైన కొలమానం. పాలకుల దృష్టిలో బలమైన ఆర్థిక వ్యవస్థ అంటే కేవలం షేర్ మార్కెట్ లాభాలు కాదు.. అప్పుల్లేని బలమైన సామాన్య కుటుంబం అని ప్రభుత్వాలు గుర్తించినప్పుడే దేశంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది

పోటీ కాదు.. సహకారమే మన భవిష్యత్తు!

- భారత్-ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ పిలుపు
- ప్రపంచ జనాభాలో నాలుగో వంతుకు ప్రాతినిధ్యం
- శాంతి, స్థిరత్వం, సమష్టి అభివృద్ధే లక్ష్యం





మనీలా, నవంబర్ 17 (చురకలు): భారత్-ఆసియాన్ దేశాల కూటమి కలిసి ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, కాబట్టి మన ఉమ్మడి భవిష్యత్తును కేవలం పోటీ కాకుండా పరస్పర సహకారమే నిర్దేశించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మంగళవారం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన ఇండియా-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో 11 సభ్య దేశాల నేతలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ భాగస్వామ్యంలో ఆసియాన్ ఐక్యత, దాని కీలక భూమికకు భారత్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. గడిచిన కొన్నేళ్లుగా ప్రపంచం వరుస సంక్షోభాలను ఎదుర్కొంటోందని, నేడు ప్రపంచానికి అత్యంత అవసరమైనది శాంతి, స్థిరత్వం, ఊహించదగిన భవిష్యత్తు అని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సదస్సు ప్రధాన ఇతివృత్తమైన 'నావిగేటింగ్ అవర్ ఫ్యూచర్, టుగెదర్' (మన భవిష్యత్తును సంయుక్తంగా మార్గనిర్దేశం చేసుకోవడం) అనే అంశానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని శాంతి, స్థిరత్వానికి చిహ్నంగా మార్చే శక్తి, సంకల్పం భారత్, ఆసియాన్ రెండింటికీ ఉన్నాయని ఆయన అన్నారు. భారతదేశ అభివృద్ధి, ఆసియాన్ శ్రేయస్సు ఒకదానితో ఒకటి లోతుగా ముడిపడి ఉన్నాయని మోదీ ఉద్ఘాటించారు. రాబోయే సంవత్సరాల్లో 'ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045', 'వికసిత భారత్ 2047' లక్ష్యాలు మన ఉమ్మడి ఆకాంక్షలను నెరవేర్చడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశం మన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడంతో పాటు, సురక్షితమైన, సమ్మిళిత, సంపన్నమైన ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 1967లో ఏర్పాటైన ఆసియాన్ కూటమి ఆగ్నేయాసియా దేశాల మధ్య ఆర్థిక వృద్ధి, రాజకీయ స్థిరత్వం, భద్రత, సాంస్కృతిక సహకారాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం బ్రూనై, కంబోడియా, ఇండోనేషియా, లావోస్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, తైమూర్-లెస్టే, వియత్నాం సహా మొత్తం 11 దేశాలు ఇందులో సభ్య దేశాలుగా ఉన్నాయి.

వాళ్లు సైన్స్ తెలియని మూర్ఖులు

ఇథనాల్ బ్లెండింగ్‌పై కేంద్ర మంత్రి సురేశ్ గోపీ సంచలన వ్యాఖ్యలు

శాస్త్రీయ పరిశోధనల తర్వాతే ఈ20 విధానం అమలు

ఇథనాల్ మిశ్రమంపై దుష్ట రాజకీయాలు చేస్తున్నారని విమర్శ

అనుమానాలుంటే పెట్రోల్‌ను పరీక్షించుకోవచ్చని సవాల్



త్రిస్సూర్, నవంబర్ 17 (చురకలు): పలు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సరఫరా చేస్తున్న పెట్రోల్‌లో ఇథనాల్ బ్లెండింగ్ (కలపడం) నిర్దేశిత 20 శాతం పరిమితిని మించుతోందంటూ వస్తున్న ఆరోపణలను కేంద్ర మంత్రి సురేశ్ గోపీ తీవ్రంగా ఖండించారు. అటువంటి నిరాధార ఆరోపణలు చేస్తున్న వారిని 'సైన్స్ తెలియని మూర్ఖులు'గా అభివర్ణించారు. కేరళలోని త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పెట్రోల్ వాహనాల ద్వారా వెలువడే కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇథనాల్‌ను కలపడం ఒక్కటే ప్రస్తుతం ఉన్న మార్గమని స్పష్టం చేశారు. విస్తృత శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించిన అనంతరమే.. 'ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' (ూూూ×) ఆమోదంతో భారత్‌లో జు10 నుంచి జు20 ఇథనాల్ బ్లెండింగ్‌కు మారినట్లు సురేశ్ గోపీ గుర్తుచేశారు. ఇథనాల్ కలపడం వల్ల ఇంజిన్లు దెబ్బతిన్నాయని ఇప్పటివరకు ఎలాంటి బీమా (ఇన్సూరెన్స్) క్లెయిమ్‌లు రాలేదన్నారు. "ఇథనాల్ బ్లెండింగ్‌పై ప్రస్తుతం అనేక దుష్ట రాజకీయాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇథనాల్ మిశ్రమం నిర్దేశిత పరిమితిని దాటిపోయిందనే తప్పుడు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వాదనలు చేస్తున్నవారిలో ఎవరికీ సైన్స్ గురించి కనీస అవగాహన లేదు" అని ఆయన మండిపడ్డారు. పెట్రోల్‌లోని ఇథనాల్ శాతాన్ని ఎవరైనా, ఎప్పుడైనా పరీక్షించుకోవచ్చని, అలాంటి తనిఖీలను తాను ఏమాత్రం వ్యతిరేకించనని సురేశ్ గోపీ తెలిపారు. పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం ఖచ్చితంగా 20 శాతానికి చేరుకోగానే, ఆటోమేటిక్‌గా వాల్వ్ ఆగిపోయేలా యంత్రాల సాంకేతిక వ్యవస్థ ఉంటుందని.. ఏ పెట్రోల్ బంకు నుంచైనా లభించే గరిష్ఠ ఇథనాల్ శాతం ఇదేనని ఆయన వివరించారు.

ఆటో డ్రైవర్‌గా బ్రిటన్ యువరాజు..

ప్రయాణికురాలిగా యువరాణి!

ముంబయిలో ప్రిన్స్ విలియం, కేట్ మిడిల్టన్ సందడి



ముంబయి, నవంబర్ 17 (చురకలు): బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియం, యువరాణి కేట్ మిడిల్టన్ ఆటోలో ప్రయాణించినట్లు వెలువడిన వార్త ఆసక్తికరంగా మారింది. భారత్ పర్యటనలో భాగంగా మంగళవారం ముంబయిలోని బాంద్రా రెక్లమేషన్ గార్డెన్‌ను సందర్శించిన రాజదంపతులు మహీంద్రా సంస్థకు చెందిన విద్యుత్ ఆటోలో ప్రయాణించినట్లు సమాచారం. ప్రిన్స్ విలియం స్వయంగా ఆటో నడపగా, కేట్ మిడిల్టన్ వెనుక సీటులో కూర్చున్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఎర్త్‌షాట్ ప్రైజ్--2026కు ఎంపికైన తుది పోటీదారులతో సమావేశమయ్యారు. పర్యావరణ సమస్యలకు వినూత్నమైన, ఆచరణాత్మక పరిష్కారాలను ప్రోత్సహించేందుకు ప్రిన్స్ విలియం 2020లో ఎర్త్‌షాట్ ప్రైజ్‌ను ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ప్రకృతి వనరుల సంరక్షణకు కృషి చేస్తున్న ఆవిష్కర్తలను ఈ పురస్కారం ద్వారా ప్రోత్సహిస్తారు. భారత్‌లో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ వాహనాల వినియోగానికి ప్రాధాన్యం ఇస్తూ రాజదంపతులు ఆటోలో ప్రయాణించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచినట్లు కథనాలు వెల్లడించాయి.

దాడికి ముందే రెక్కీ..

సీసీ కెమెరాల్లో ఉగ్రవాదుల కదలికలు!

సీఆర్‌పీఎఫ్ బలగాలపై దాడికి ముందే పక్కా ప్రణాళిక

ఎదురుకాల్పుల్లో ఉమర్ నిసార్ దార్ హతం

శ్రీనగర్, నవంబర్ 17 (చురకలు): జమ్మూకశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్ బలగాలపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ముందుగానే రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. లష్కరే తోయిబా కమాండర్ మహమ్మద్ లతీఫ్ భట్, అతడి సహాయకుడు ఉమర్ నిసార్ దార్ దాడికి ముందు పలు ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయని పోలీసులు గుర్తించారు. నవంబర్ 11న కుల్గామ్ జిల్లాలోని అఖ్రాన్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ చెక్‌పోస్ట్‌పై జరిగిన దాడికి ముందు రోజు వీరిద్దరూ రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. నవంబర్ 10న లతీఫ్ భట్, ఉమర్ నిసార్ దార్ కలిసి మీర్‌బజార్, అఖ్రాన్, హబ్లిష్, కిలామ్ ప్రాంతాల్లో తిరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా గుర్తించారు. భద్రతా బలగాల కదలికలను పరిశీలించడంతోపాటు దాడికి అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు వీరు రెక్కీ నిర్వహించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. నవంబర్ 11న అఖ్రాన్ సీఆర్‌పీఎఫ్ చెక్‌పోస్ట్‌పై జరిపిన కాల్పుల్లో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. దాడి అనంతరం ఉగ్రవాదులు అక్కడి నుంచి పారిపోయిన దృశ్యాలు కూడా కెమెరాల్లో నమోదైనట్లు తెలిపారు. కాగా, నవంబర్ 16న కుల్గామ్ జిల్లాలో ఉగ్రవాదుల కదలికలను గుర్తించిన భద్రతా బలగాలు గాలింపు చేపట్టగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఉమర్ నిసార్ దార్ హతమయ్యాడని అధికారులు వెల్లడించారు. లష్కరే కమాండర్ లతీఫ్ భట్ మాత్రం గాయాలతో తప్పించుకున్నట్లు పేర్కొన్నారు. అతడిని పట్టుకునేందుకు భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ఉగ్రవాదుల కదలికలు, దాడి వెనుక ఉన్న ప్రణాళికపై దర్యాప్తు కొనసాగుతోంది.





గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి ఆ రెస్టారెంట్‌కు వెళ్లా!

అమ్మానాన్న తొలిసారి కలుసుకున్న చోటుకే ప్రేయసితో..

తన గత జ్ఞాపకాలను పంచుకున్న రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, నవంబర్ 17 (చురకలు): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ ఆసక్తికర జ్ఞాపకాన్ని పంచుకున్నారు. గతంలో తన ప్రేయసితో కలిసి బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్‌లో ఉన్న ఓ రెస్టారెంట్‌కు వెళ్లినట్లు వెల్లడించారు. ఆ రెస్టారెంట్‌లోనే తన తల్లిదండ్రులు రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ తొలిసారి కలుసుకున్నారని తెలిపారు. సోనియా గాంధీ జీవిత విశేషాలకు సంబంధించిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకావిష్కరణ సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ ఈ విషయాన్ని ప్రస్తావించారు. చాలా సంవత్సరాల క్రితం తన ప్రేయసితో కలిసి కేంబ్రిడ్జ్‌లోని ఓ రెస్టారెంట్‌కు వెళ్లానని, అక్కడికి వెళ్లే వరకు ఆ ప్రదేశానికి తన కుటుంబంతో ఉన్న అనుబంధం ఆమెకు తెలియదని రాహుల్ వివరించారు. రెస్టారెంట్‌కు వెళ్లిన తర్వాత తన తల్లిదండ్రులు తొలిసారి అక్కడే కలుసుకున్న విషయాన్ని ఆమెకు చెప్పినట్లు గుర్తుచేసుకున్నారు. అయితే ఆ ప్రేయసి ఎవరన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. గతంలో రాహుల్ వ్యక్తిగత జీవితం, వివాహంపై అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. 2004లో వెరోనిక్ అనే స్పెయిన్‌కు చెందిన మహిళ తనకు అత్యంత సన్నిహిత మిత్రురాలని రాహుల్ వెల్లడించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే తాజా వ్యాఖ్యల్లో ప్రస్తావించిన వ్యక్తి ఆమెనేనా అన్న విషయంపై స్పష్టత లేదు. గతంలో పలువురితో రాహుల్ వివాహం జరగబోతోందంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగినప్పటికీ అవి ధ్రువీకరణకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో తన తల్లిదండ్రుల ప్రేమకథతో ముడిపడిన ఓ వ్యక్తిగత జ్ఞాపకాన్ని రాహుల్ పంచుకోవడం ఆసక్తికరంగా మారింది.

ఘనంగా ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ జన్మదిన వేడుకలు

ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కేక్ కటింగ్.. పేదలకు అన్నదానం..



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 17, :
జూబ్లీహిల్స్ యువ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయన జన్మదిన వేడుకలు సిద్దిపేటలో ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఎతిహాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్యూఐ రాష్ట్ర కార్యదర్శి సన, తొడెంగల రజిని ముదిరాజ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నర్వహించారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులు, నిరుపేదలకు అన్నదానం చేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం అభినందనీయమని సిద్దిపేట జిల్లా ప్రజలు పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తప్పెట శంకర్, మాజీ కౌన్సిలర్ సాకి బాల్ లక్ష్మి ఆనంద్, ఆలకుంట మహేందర్, కాంగ్రెస్ నాయకులు గుండు రవితేజ, చెంగిరెడ్డి అంజిరెడ్డి, గ్యార రవి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి మహాపడి పూజకు రావాలని కెసిఆర్ ను కోరిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 17, : శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజ మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్)ను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ నెల 19వ తేదీ గురువారం ఉదయం 9:30 గంటలకు శంభీపూర్‌లోని తన నివాసంలో శ్రీశ్రీశ్రీ మాన్య అరుణ్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజ మహోత్సవానికి హాజరుకావాలని కోరుతూ మంగళవారం గజ్వేల్‌లోని ఎర్రవల్లిలో ఉన్న కేసీఆర్ నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మహాపడి పూజ మహోత్సవ విశేషాలను కేసీఆర్‌కు వివరించి, స్వామివారి ఆశీస్సులు అందరికీ కలగాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న ఈ పవిత్ర ఆధ్యాత్మిక కార్యక్రమానికి విచ్చేసి తమను ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కోరారు.

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములను అమ్మొద్దు!

- కొవ్వొత్తులతో స్థానికుల నిరసన.. భవిష్యత్ తరాల జీవితాల్లో వెలుగులు నింపాలి.. అంధకారం చేయొద్దు

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 17, :



ట్రక్ పార్క్ భూములను ప్రభుత్వం అమ్మకానికి పెట్టడాన్ని నిరసిస్తూ స్థానికులు మంగళవారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా భూములను విక్రయించవద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు ఉపయోగపడాల్సిన విలువైన భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ప్రభుత్వాలు ప్రజా అవసరాలకు ఉపయోగపడే భూములను విక్రయించుకుంటూ పోతే రాబోయే తరాలకు ఏమి మిగులుతుందని ప్రశ్నించారు. భవిష్యత్ తరాల జీవితాల్లో వెలుగులు నింపాలి తప్ప, వారి భవిష్యత్తును అంధకారం చేయకూడదని పేర్కొన్నారు.కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములను విక్రయించకుండా ప్రజా అవసరాల కోసం కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, స్థానికులు, అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

- నవంబర్ 19 నుంచి డిసెంబర్ 4 వరకు ఆంక్షలు
- అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, సభలకు అవకాశం లేదు
- భారీ శబ్దాలతో డీజే వినియోగంపై నిషేధం
- నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 17, :
సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు సిటీ పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 19వ తేదీ ఉదయం 6 గంటల నుంచి డిసెంబర్ 4వ తేదీ ఉదయం 6 గంటల వరకు పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆంక్షలు అమలులో ఉంటాయని వెల్లడించారు. ఈ సమయంలో ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు సంబంధిత ఏసీపీ అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. అలాగే బండ్ల పేరుతో వివిధ కారణాలను చూపుతూ సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయాలని ఒత్తిడి చేయడం, బెదిరింపులకు పాల్పడడం వంటి చర్యలకు దిగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డీజే శబ్దాలపై నిషేధం..

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని భారీ శబ్దాలతో కూడిన డీజే సౌండ్‌ల వినియోగంపై కూడా నిషేధాజ్ఞలు విధించారు. నవంబర్ 19 ఉదయం 6 గంటల నుంచి డిసెంబర్ 4 ఉదయం 6 గంటల వరకు ఈ నిషేధం అమలులో ఉంటుందని తెలిపారు. చిన్న పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, విద్యార్థులకు శబ్ద కాలుష్యం వల్ల ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మైక్‌సెట్ వినియోగం తప్పనిసరి అయిన సందర్భాల్లో సంబంధిత డివిజన్ ఏసీపీ అధికారుల నుంచి అనుమతి పొందాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి డీజేలను వినియోగించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆంక్షలను ఉల్లంఘించే వారిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 223తో పాటు సంబంధిత సిటీ పోలీస్ యాక్ట్, పోలీస్ యాక్ట్ నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు పోలీసుల ఆదేశాలను పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ కోరారు.

మెరుగైన వైద్యం కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ ఎల్ఓసీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- నిరుపేదలకు వైద్య చికిత్సలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండ
- ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ చొరవతో రూ.3 లక్షల ఎల్ఓసీ మంజూరు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 17, : ఆర్థిక ఇబ్బందుల కారణంగా మెరుగైన వైద్యం పొందలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా అందించే ఎల్ఓసీ సదుపాయం ఎంతో ఉపయోగకరమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ సూచించారు. చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతానికి చెందిన గొరస రామలింగాచారి తండ్రి సుబ్రమణ్యం అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. బాధిత కుటుంబానికి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3,00,000 (మూడు లక్షల రూపాయలు) మంజూరు చేయించారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ గాజుల సుజాతలు ఎల్ఓసీకి సంబంధించిన పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రదీప్ తాళ్లూరి, ఫైజల్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము ధూళితో ఉక్కిరి బిక్కిరి.. మహాదేవపురం ప్రజల ఆవేదన!

- నెల రోజులుగా దుమ్ముతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న కాలనీవాసులు –
- అధికారుల తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 17, : మహదేవపురం చౌరస్తా పరిసర ప్రాంతాల్లో దుమ్ము ధూళి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. గత నెల రోజులుగా రాత్రింబవళ్లు తేడా లేకుండా విపరీతంగా దుమ్ముతో కూడిన గాలులు వీస్తుండటంతో మహదేవపురం కాలనీతో పాటు చుట్టుపక్కల కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మంగళవారం ఉదయం మహదేవపురం చౌరస్తా పరిసరాల్లో దుమ్ము ధూళి భారీగా వ్యాపించడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రోడ్లపై ప్రయాణించే వాహనదారులు, నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు దుమ్ము ధూళిని పీల్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు, స్థానిక నివాసితులు శ్వాసకోశ సంబంధిత సమస్యలతో పాటు పలు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము ధూళి కారణంగా ఇళ్లలోకి కూడా దుమ్ము చేరుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మహదేవపురం చౌరస్తాతో పాటు పరిసర కాలనీల్లో దుమ్ము నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, రోడ్లపై క్రమం తప్పకుండా నీటిని చల్లడంతో పాటు దుమ్ము వ్యాప్తికి గల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని మహదేవపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో పిల్లలు, పెద్దలు శ్వాసకోశ వ్యాధుల బారినపడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

హెచ్ఎంటీ ప్రీమియర్ లీగ్ సీజన్–6 ఫైనల్ మ్యాచ్ ఘనంగా నిర్వహణ

- క్రీడలతో యువతలో క్రమశిక్షణ, ఐక్యత, స్నేహభావం పెంపొందుతాయి – కూన రాఘవేందర్ గౌడ్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 17, : హెచ్ఎంటీ ప్రీమియర్ లీగ్ (హెచ్‌పీఎల్) సీజన్–6 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఉత్సాహభరిత వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించారు. 291వ డివిజన్‌కు చెందిన ఫయాజ్, నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఈ టోర్నమెంట్ ముగింపు వేడుకలు క్రీడాకారులు, క్రీడాభిమానుల సందడితో ఘనంగా జరిగాయి. ఈ ఫైనల్ మ్యాచ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూన రాఘవేందర్ గౌడ్ పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, ఐక్యత, స్నేహభావం, నాయకత్వ లక్షణాలను అలవర్చుతాయని పేర్కొన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చక్కని వేదికగా నిలుస్తాయని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. హెచ్ఎంటీ ప్రీమియర్ లీగ్ సీజన్–6ను విజయవంతంగా నిర్వహించి యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించిన నిర్వాహకులు ఫయాజ్, నాగరాజులను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ యువతకు క్రీడల్లో మరింత ప్రోత్సాహం అందిస్తూ, వారి అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. యువతే దేశానికి బలం.. క్రీడలే ఐక్యతకు ప్రతీక అనే సందేశంతో హెచ్ఎంటీ ప్రీమియర్ లీగ్ సీజన్–6 ఫైనల్ మ్యాచ్ విజయవంతంగా ముగిసింది.

ఘనంగా గాజులరామారంలో శ్రీశ్రీ కోటి దీపోత్సవం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 17, : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గాజులరామారంలోని శ్రీశ్రీశ్రీ నకులేశ్వరి దేవి సిద్ధి పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీశ్రీ కోటి దీపోత్సవ మహోత్సవం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా జరిగింది. వేలాది దీపాల వెలుగులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపారాధనలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమానికి సోమవారం ముఖ్య అతిథిగా కేకేఎం ట్రస్ట్ చైర్మన్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కోటి దీపోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్తీక మాసంలో దీపారాధనకు ఎంతో విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. దీపారాధన మనలో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వ భావనలను బలోపేతం చేస్తుందని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మన సనాతన సంప్రదాయాలు, సంస్కృతి, ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో ఇంతటి ఘనమైన కోటి దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కోటి దీపోత్సవ కమిటీ సభ్యులు కూన శ్రీనివాస్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోటి దీపోత్సవ నిర్వాహకులతో పాటు టిపిసిసి అధికార ప్రతినిధి సొంటిరెడ్డి పున్నారెడ్డి, సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, బాలప్ప, అంజిరెడ్డి, ఎం. సాగర్, దంపబోయిన శ్రీనివాస్, రాజిరెడ్డి, గుబ్బల రమణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కోటి దీపోత్సవాన్ని విజయవంతం చేశారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి





- అధికారులకు జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశం
- నవంబర్ 19న సిద్దిపేటలో ఇందిరమ్మ చీరలు, కుటుంబ బీమా పథకాల ప్రారంభం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 17, : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 19న సిద్దిపేట జిల్లా కేంద్రంలో చేపట్టనున్న పర్యటనను సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్‌తో కలిసి జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి వివిధ శాఖలకు అప్పగించిన బాధ్యతలు, చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19న ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా సిద్దిపేటకు చేరుకుని, అక్కడి నుంచి నిర్ణయించిన మార్గంలో సభా ప్రాంగణానికి చేరుకుంటారని తెలిపారు. అనంతరం భారీ బహిరంగ సభలో ఇందిరమ్మ చీరల పంపిణీ, ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి శాఖకు కేటాయించిన పనులను బాధ్యతాయుతంగా నిర్వహించి, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కానున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాసుల జారీ, వేదిక నిర్మాణం, ప్రజలకు సరిపడా కుర్చీలు, తాగునీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ధ్వని వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా వైద్య శిబిరాలు, అంబులెన్సులు, హెలిప్యాడ్, పటిష్టమైన పోలీసు బందోబస్తు, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు పోలీసు శాఖతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, జిల్లా అటవీ శాఖ అధికారి పద్మజారాణి, సిద్దిపేట, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, రామ్మూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ప్రేమతో చేయూతనివ్వాలి

- విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, పండ్లు పంపిణీ చేసిన హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ
- సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 17, : పేద విద్యార్థులను ప్రేమతో ఆదరిస్తూ, వారి అవసరాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో సంఘ సేవకులు ఎం.డి. జాకీర్ తండ్రి దివంగత ఎం.డి. అబ్దుల్ జబ్బార్ 17వ వర్ధంతిని పురస్కరించుకొని సేవా కార్యక్రమం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ సమీపంలోని గణేష్ నగర్ డివిజన్ రామకృష్ణానగర్‌లో ఉన్న మండల ప్రాథమిక పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని సుమారు 100 మంది చిన్నారి విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, పండ్లను ఎం.డి. జాకీర్ సొసైటీ ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ, దివంగత అబ్దుల్ జబ్బార్ వర్ధంతిని సేవా కార్యక్రమంతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. దాతలు తమ పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం, జయంతి, వర్ధంతి వంటి ప్రత్యేక సందర్భాల్లో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీని సంప్రదిస్తే తమ వంతు సహాయ సహకారాలు అందించి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతామని విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలోని నిరుపేదలకు అండగా నిలవడంతో పాటు చిన్నారుల్లో సేవాభావం, సమానత్వం పట్ల స్ఫూర్తిని నింపవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాలునేత జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు..
- ఆశీర్వదించిన మాజీ కార్పొరేటర్ బుడ్డా విజయ్ శేఖర్ గౌడ్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 17, : రంగారెడ్డినగర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, విజయనగర్ కాలనీ ఉపాధ్యక్షులు బాలునేత జన్మదిన వేడుకలు మంగళవారం విజయనగర్ కాలనీలోని ఆయన నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితులు, బీఆర్ఎస్ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు బాలునేతకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బాలునేత డివిజన్ మాజీ కార్పొరేటర్ బుడ్డా విజయ్ శేఖర్ గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయ్ శేఖర్ గౌడ్ ఆశీర్వాదం తీసుకున్నారు. బాలునేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్, ప్రజలకు ఇదే విధంగా సేవలు అందిస్తూ, అందరి మన్ననలు పొందుతూ మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు సతీశ్ గట్టోజి, శివ తదితరులు పాల్గొని బాలునేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



చేయూత పింఛన్లతో పేదలకు భరోసా.. సీఎం రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం

- పింఛన్ మంజూరు పత్రాల పంపిణీపై కాంగ్రెస్ శ్రేణుల హర్షం

సదాశివపేట, నవంబర్ 17, :

రాష్ట్రంలోని అర్హులైన పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర నిరుపేద వర్గాలకు అండగా నిలిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత భరోసానిస్తున్నాయని సదాశివపేట మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ అన్నారు. నూతనంగా మంజూరైన చేయూత పింఛన్లకు సంబంధించి లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ చేపట్టిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్లు మంజూరు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు వృద్ధులు, దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని నాయకులు అభిప్రాయపడ్డారు. సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చాలనే ప్రభుత్వ లక్ష్యం అభినందనీయమని పేర్కొంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజు గౌడ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రోడ్ల అభివృద్ధికి రూ.200 కోట్ల నిధులు మంజూరు చేయండి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 17, :

దుబ్బాక నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రహదారులు అధ్వానంగా మారి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్ల మరమ్మతులు, నూతన రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం మంత్రిని కలిసి నియోజకవర్గంలోని రహదారుల సమస్యలను వివరిస్తూ లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. తొగుట, భూంపల్లి, దుబ్బాక మండలాల్లో హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణంతో పాటు మొండి చింత–బేగంపేట రోడ్డు, భూంపల్లి–దొమ్మాట రోడ్డు, హబ్సిపూర్–దుబ్బాక రోడ్డు, దుబ్బాక–మెదక్–సిద్దిపేట రహదారి, మెట్టు–దౌల్తాబాద్ రోడ్డు తదితర మార్గాల పునరుద్ధరణ, రెన్యూవల్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.నియోజకవర్గంలో కొత్త రహదారుల నిర్మాణం, పాత రోడ్ల మరమ్మతులు, పునరుద్ధరణ పనుల కోసం సుమారు రూ.200 కోట్ల నిధులు మంజూరు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రోడ్లు దెబ్బతినడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు, రైతులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, ఆయా పనులకు ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, రహదారుల అభివృద్ధికి సంబంధించిన అంశాలను పరిశీలించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు.



కోటి దీపోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీసీసీ అధికార ప్రతినిధి సొంటిరెడ్డి పున్నారెడ్డి



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 17, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం డివిజన్‌లో శ్రీ శ్రీ శ్రీ నకులేశ్వర దేవి సిద్ధిపీఠం నందు స్వామివారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పవిత్రమైన కోటి దీపోత్సవ మహోత్సవంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సొంటిరెడ్డి పున్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటి దీపాల కాంతులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న ఈ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుచ్చిరెడ్డి, గంట శివారెడ్డి, మహేష్ గౌడ్, మరలింగ, పవన్, పీఠం నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షులు బుయ్యేని శివకుమార్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 17, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ ఉపాధ్యక్షులు బుయ్యేని శివకుమార్ తన జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి శివకుమార్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైట్ చైర్మన్ కటకం జయరాం, గిరినగర్ డివిజన్ అధ్యక్షులు బుదానా కనకరావు, హమ్మిరెడ్డి తదితరులు పాల్గొని శివకుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

19వ వార్డులో చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

- అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ పత్రాలు అందజేసిన కౌన్సిలర్ పట్లూరి రోజా నాగరాజు గౌడ్



సదాశివపేట, నవంబర్, 17,:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పింఛన్ పథకంలో భాగంగా సదాశివపేట పట్టణంలోని 19వ వార్డుకు చెందిన నూతన లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను వార్డు కౌన్సిలర్ పట్లూరి రోజా నాగరాజు గౌడ్ అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన పేద కుటుంబాలకు చేయూత పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తాయని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 19వ వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి, వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.పింఛన్ మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు బిఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం



- కొడిమ్యాల మండల అధ్యక్షుడు పులి వెంకటేష్ గౌడ్

చొప్పదండి/కొడిమ్యాల, నవంబర్ 14, :

కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి బృందావనం రిసార్ట్‌లో నేడు జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ హాజరుకానున్నారని బిఆర్ఎస్ కొడిమ్యాల మండల అధ్యక్షుడు పులి వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఈ సమావేశానికి కొడిమ్యాల మండలంలోని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, గ్రామ, మండల అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

రేపు నిర్వహించే సీఎం సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం
- బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా అధికారులు.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేతలు..

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 17, :

నవంబర్ 19న గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సిద్దిపేట బైపాస్ రోడ్డులోని నాగదేవత ఆలయం సమీపంలో ఏర్పాటు చేస్తున్న సభా ప్రాంగణాన్ని మంగళవారం ఆయన సందర్శించి ఏర్పాట్ల పురోగతిని పరిశీలించారు. సభకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల వాహనాల పార్కింగ్, బారికేడింగ్, విద్యుత్ దీపాల ఏర్పాటు, భద్రత, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సభా వేదిక నిర్మాణంతో పాటు మిగిలిన



పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 19న సిద్దిపేట వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలోనే తొలిసారిగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నారు. అదే రోజు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నారు. ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, రానున్న రోజుల్లో అమలు చేయనున్న పథకాలు, కార్యక్రమాలపై ముఖ్యమంత్రి సభలో ప్రసంగించనున్నారు. ఈ సభకు సిద్దిపేటతో పాటు గజ్వేల్, దుబ్బాక, జనగామ, హుస్నాబాద్, మానకొండూర్, సిరిసిల్ల, వేములవాడ, నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి, ప్రభుత్వ సలహాదారు వి హనుమంత రావు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు ముఖ్య మంత్రి పాదయాత్ర ప్రారంభం కానున్న ముస్తాబాద్ చౌరస్తాను జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి, పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాల్‌తో కలిసి పరిశీలించారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు

- చేయూత పెన్షన్లను పంపిణీ చేసిన సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు

దమ్మపేట, నవంబర్ 17, :

దమ్మపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ పగడాల రమాదేవి, ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పగడాల రమాదేవి మాట్లాడుతూ అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చేతుల మీదుగా దమ్మపేట మండలంలోని నూతన పెన్షన్ లబ్ధిదారులకు మందలపల్లి ట్రైబల్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రాంగణంలో పెన్షన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆ కార్యక్రమానికి హాజరుకాలేని దమ్మపేట గ్రామపంచాయతీ పరిధిలోని లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు నూతన పెన్షన్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. అర్హులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు రూ.5 లక్షల బీమా సౌకర్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ వైద్య సదుపాయం, రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు, స్థలం లేని నిరుపేదలకు కూడా ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా పథకం కింద ఇప్పటివరకు సుమారు రూ.35,839 కోట్లకు పైగా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు, రైతు రుణమాఫీ సుమారు రూ. 20,616 కోట్లకు పైగా నిధులను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది అన్నారు. పంచాయతీ ఎన్నికల సమయంలో ఓట్లు అభ్యర్థించేందుకు వచ్చినప్పుడు పలువురు ప్రజలు తమకు పెన్షన్లు రావడం లేదని సమస్యను తమ దృష్టికి తీసుకొచ్చారని పాలకవర్గ సభ్యులు గుర్తుచేశారు. ప్రజల సమస్యలను గుర్తించి, పేదల



పక్షపాతిగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు నూతన పెన్షన్లు మంజూరు చేయడం ద్వారా వారి కోరికను నెరవేరుస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి, గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, పూనెం పోలమ్మ, చిన్నశెట్టి నాగలక్ష్మి , గ్రామస్తులు పగడాల రాంబాబు, దాసరోజు రామారావు, పిట్టల శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చేయూత పింఛన్లు అందజేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ

ఉమ్మడి వరంగల్ బ్యూరో, నవంబర్ 17, :

వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రి, వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండా సురేఖ మాట్లాడుతూ సమాజంలోని నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితర అర్హులైన వర్గాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పింఛన్లు లబ్ధిదారులకు నెలవారీ ఆర్థిక ఆసరాగా నిలుస్తూ వారి జీవనానికి భరోసానిస్తున్నాయని తెలిపారు. ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పింఛన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే కొండా సురేఖ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

- విద్యార్థులకు న్యాయమూర్తి బి. భవాని హితవు

దమ్మపేట, నవంబర్ 17, :

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, న్యాయమూర్తి బి. భవాని సూచించారు. మంగళవారం మందలపల్లి గురుకుల కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి భవాని మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతుందని



హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బ తినడమే కాకుండా, చదువుపై ఏకాగ్రత తగ్గి విద్యాభ్యాసానికి ఆటంకం కలుగుతుందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, సంబంధిత చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదై భవిష్యత్తులో విద్యా, ఉద్యోగ అవకాశాలకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని వివరించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా క్రమశిక్షణతో మెలగాలని, తల్లిదండ్రులకు, చదువుతున్న విద్యా సంస్థకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యపై దృష్టి సారిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళీమోహన్, జనరల్ సెక్రటరీ లక్కినేని నరేంద్రబాబు, న్యాయవాదులు తామ బాలరాజు, నల్లపు ఉదయ్ కుమార్, గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, లీగల్ సర్వీసెస్ సిబ్బంది రాజ్ కుమార్, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నూతనకల్, నవంబర్17, :

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యారు. నూతనకల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగరాజు తెలిసిన వివరాల ప్రకారం మండల పరిధిలో మంగళవారం మధ్యాహ్నం సుమారు 1:00 గంటల సమయంలో నూతనకల్ మండలం దిరసనపల్లి గ్రామానికి చెందిన సోమిరెడ్డి (56), తన టీవీఎస్ ఎక్సల్ ద్విచక్ర వాహనం నంబర్ టీజీ-29-డీ-924 పై గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమికి వెళ్తుండగా, ఎన్ హెచ్-65 జాతీయ రహదారిపై మహబూబాబాద్ వైపు వెళ్తున్న టీఎస్-26-జీ-2626 నంబరు గల హ్యుందాయ్ క్రెటా కారు అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఆయన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోమిరెడ్డికి తీవ్రంగా రక్త గాయాలయ్యాయి. ఢీకొన్న కారు అదుపుతప్పి రోడ్డుపై పల్టీలు కొట్టగా, కారు డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు నూతనకల్ పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.



రోడామేస్త్రీ నగర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి విస్తృత పర్యటన

- కార్యకర్తలకు అండగా ఉంటాం.. పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి – గిరివర్ధన్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 17, : కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని రోడామేస్త్రీ నగర్ డివిజన్‌లో బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. అనంతరం ఇటీవల ప్రమాదానికి గురైన పార్టీ కార్యకర్తను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తకు ధైర్యం చెబుతూ, పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌తో కలిసి గిరివర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. హామీల అమలులో జాప్యం చేస్తూ ప్రజలకు నిరాశ కలిగిస్తోందని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. పార్టీ చేపట్టే కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక సహకారంతో పాటు అన్ని విధాలుగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో, ఐక్యతతో, సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డివిజన్ అధ్యక్షులు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన డివిజన్ కార్యవర్గ సమావేశంలో గిరివర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన డివిజన్ కార్యవర్గ సభ్యులకు ఆయన చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన నాయకులు, కార్యకర్తలు పార్టీ



అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్ రావుల శేషగిరిరావు, రాష్ట్ర నాయకులు దయాకర్, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి అరికెల సుధ, జిల్లా మోర్చా అధ్యక్షులు శేఖర్ యాదవ్, శ్రీనాథ్, జిల్లా నాయకులు శేఖర్ ముదిరాజ్, రచ్చ చక్రధర్, శివాజీ, రాజ్ భాను చందర్, సాయినాథ్ నేత, కంది శ్రీరాములు, భీమ్ రావు, భీమ్ రాజు, విజయ్ శంకర్, డివిజన్ అధ్యక్షులు కట్ట కుమార్, సాయి ప్రతాప్, శారద, వేణుగోపాల్, ముఖ్య నాయకులు, మురళి గౌడ్, బీజేవైఎం నాయకులు, పార్టీ కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

పెన్షనరీ బకాయిల కోసం నల్లజెండాలతో నిరసన

- సీఎం రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటనలో ఆందోళనకు రిటైర్డ్ ఉద్యోగుల పిలుపు
- బకాయిలు అందక 283 మంది రిటైర్డ్ ఉద్యోగులు మృతి చెందడం బాధాకరం కోహెడ చంద్రమౌళి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 17, :

పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన పెన్షనరీ బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోహెడ చంద్రమౌళి డిమాండ్ చేశారు. మార్చి 2024 నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, కమ్యూటేషన్ తదితర బకాయిలను వడ్డీతో సహా వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లా పర్యటన సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులందరూ నల్లజెండాలతో నిరసన తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో చంద్రమౌళి మాట్లాడుతూ జీవితకాలం ప్రభుత్వానికి సేవలందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమకు రావాల్సిన సొంత సొమ్ము కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల జీవితకాలపు పొదుపు అయిన జీపీఎఫ్, కమ్యూటేషన్ బకాయిలు సకాలంలో అందక అనేక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. బకాయిలు అందక ఇప్పటికే 283 మంది రిటైర్డ్ ఉద్యోగులు మరణించినా ప్రభుత్వం స్పందించకపోవడం అత్యంత బాధాకరమని విమర్శించారు. హైకోర్టు ప్రకటించిన 10 శాతం వడ్డీతో సహా బకాయిలను కోర్టును ఆశ్రయించిన వారితో పాటు కోర్టుకు వెళ్లని పెన్షనర్లందరికీ ఏకమొత్తంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు జీపీఎఫ్, కమ్యూటేషన్ బకాయిలు అందని వారికి వెంటనే చెల్లింపులు జరపాలని, డీఏ బకాయిలను విడతలవారీగా కాకుండా ఒకే బిల్లులో చెల్లించాలని కోరారు. బకాయిలు



అందక మరణించిన రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఉన్నతాధికారులకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినా అనేక ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన లేదని మండిపడ్డారు. సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాలు, ప్రచార కార్యక్రమాలపై చూపుతున్న శ్రద్ధ పదవీ విరమణ చేసిన ఉద్యోగుల న్యాయమైన బకాయిల చెల్లింపుపై కూడా చూపాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి సిద్దిపేట పర్యటన సందర్భంగా చేపట్టనున్న నల్లజెండాల నిరసన ద్వారా పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి ఒత్తిడి తీసుకురావడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెన్షనరీ బకాయిలను వడ్డీతో సహా చెల్లించి, రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోహెడ చంద్రమౌళి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు పొన్నమల్ల రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమగారి నాగిరెడ్డి, ఆర్థిక కార్యదర్శి పన్యాల రాజిరెడ్డి, తిరుపతి, సుధాకర్, వెంకట్ నారాయణ, అంజయ్య, కుదరత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ప్రత్యేక పూజలు

- తులాభారంలో పాల్గొన్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్ దంపతులు

జూబ్లీహిల్స్ ప్రతినిధి, నవంబర్ 17, :

జూబ్లీహిల్స్ యువ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం యూసుఫ్‌గూడ బస్తీలోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ అమ్మవారి దేవాలయంలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తన సతీమణితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయం ఎదుట యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తులాభార కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖలీద్, ఏజీ కాలనీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజ్జు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులాభారంలో ఒకవైపు డబ్బులు, మరోవైపు ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కూర్చొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.





ప్రజాసేవకే కాంగ్రెస్ ప్రభుత్వం పునరంకితం

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి
- గత పాలకులు పేదల సంక్షేమాన్ని విస్మరించారు
- లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

మానకొండూరు ప్రతినిధి, నవంబర్ 17, :

గత బీఆర్ఎస్ పాలనలో అణచివేతకు, నిరాదరణకు గురైన ప్రజలకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎన్నీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మానకొండూరు–ముంజంల్లి మార్గంలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో చేయూత పథకం కింద కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలకులు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించారని విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందకుండా చేశారని ఆరోపించారు. కనీసం



అర్హులకు కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం, ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చడం కూడా గత పాలకులకు సాధ్యం కాలేదని ఎద్దేవా చేశారు. రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించడంలో విఫలమయ్యారని, ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాల భూమి వంటి హామీలను అమలు చేయకుండా గాలికొదిలేశారని విమర్శించారు. ఇందిరాగాంధీ, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే నిరుపేదలకు పెద్దఎత్తున ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని గుర్తుచేశారు. అప్పటి నుంచి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాల కలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అదేవిధంగా చేయూత పథకం కింద కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు అందిస్తున్నామని, ఇకపై అర్హులైన వారందరి ఖాతాల్లో ప్రతి నెలా క్రమం తప్పకుండా పెన్షన్ నగదు జమ అవుతుందని చెప్పారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం మరో బృహత్తర పథకానికి రూపకల్పన చేసిందని, ఈ నెల 19న సిద్దిపేటలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నారని వెల్లడించారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమశాఖాధికారి దేవసాని సరస్వతి, మానకొండూరు ఎంపీడీవో వీ.వీ. వరలక్ష్మి , తహసీల్దార్ విజయ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజలింగం, వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మానకొండూరు, ఊటూరు, దేవంపల్లి పీఏసీఎస్ చైర్మన్లు రాజయ్య, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు రవీంద్రచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంపత్ గౌడ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, పీఏసీఎస్, ఏఎంసీ డైరెక్టర్లు, గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కొండగట్టు ఆంజనేయ స్వామి చందనోత్సవం, మహాసంప్రోక్షణకు గవర్నర్‌కు ఆహ్వానం

- గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక అందజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు

హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 17, :

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న 60 ఏళ్లకోసారి జరిగే చందనోత్సవం, మహాసంప్రోక్షణ, నిజరూప దర్శన మహోత్సవాలకు హాజరుకావాల్సిందిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రెవెన్యూ, దేవాదాయ శాఖల ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, ఆలయ ఈఓ అంజనా రెడ్డి తదితరులు మంగళవారం లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కొండగట్టు క్షేత్ర పురాణం, ఆలయ ఆవిర్భావం, స్థలపురాణం, ఆధ్యాత్మిక విశిష్టత, చారిత్రక ప్రాశస్త్యాన్ని గవర్నర్‌కు వారు వివరించారు. 60 ఏళ్లకోసారి నిర్వహించే ఈ విశిష్ట ఆధ్యాత్మిక ఉత్సవాల ప్రాధాన్యతను తెలియజేస్తూ, మహోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా గవర్నర్‌ను ఆహ్వానించారు. అంతకుముందు మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డాక్టర్ సౌమ్య మిశ్రా గవర్నర్ ను లోక్ భవన్ లో కలిశారు . రాష్ట్రంలో మహిళల భద్రత కు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ ప్రసూనాంబ
- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై అధికారులకు శిక్షణ
- జిల్లాలో 2,83,453 కుటుంబాల నమోదు లక్ష్యం.. 481 ప్రత్యేక శిబిరాల ఏర్పాటు

జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 17, :

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు సంబంధించి జిల్లా కలెక్టర్ బుదుమజ్జి సత్యప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల వివరాల సేకరణ, అర్హతల పరిశీలన, డేటా ఎంట్రీ, శాఖల మధ్య సమన్వయంపై అదనపు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే. (సీపాక్) సర్వే ప్రకారం జగిత్యాల జిల్లాలోని 20 మండలాలు, 5 మున్సిపాలిటీల పరిధిలో 2,83,453 కుటుంబాలను పథకంలో నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం 385 గ్రామ పంచాయతీల్లో 385 కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో 96 కేంద్రాలు కలిపి మొత్తం 481 ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కుటుంబంలో ప్రధాన సంపాదనపరులుగా ఉండి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ పథకానికి అర్హులని, బీమా పొందిన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే వారి నామినీకి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు. ఆహార భద్రత కార్డు ఉన్నవారితో పాటు, రేషన్ కార్డు లేని అర్హులు కూడా ఆధార్ ఆధారంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర జిల్లాల రేషన్ కార్డులు కలిగిన వారు కూడా సైతం సమీప శిబిరాల్లో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నామినీగా 18 ఏళ్ల నిండిన కుటుంబ సభ్యుడిని, పిల్లలు మైనర్లుగా ఉన్న సందర్భంలో అపాయింటీ వివరాలను నమోదు చేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్, పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు అధికారి అందుబాటులో ఉండాలని, ప్రజలకు సహాయంగా హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులకు కూర్చునే వసతి, తాగునీరు, విద్యుత్ బ్యాకప్ కల్పించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ నోడల్ అధికారిగా ప్రతిరోజూ సాయంత్రం గంటలకు నమోదు పురోగతిపై సమీక్ష నిర్వహిస్తారని, మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తారని తెలిపారు. గ్రామీణ



ప్రాంతాల్లో దప్పు చాటింపు, పట్టణాల్లో కేబుల్ నెట్‌వర్క్ ద్వారా పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. నవంబర్ 19 తేది నాడు ప్రతి గ్రామంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని అదే రోజు కనీసం 5–6 బీమా సభ్యత్వాలు నమోదు చేయాలని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సిపివో సత్యం గౌడ్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్రికెట్ కప్ పోస్టర్ ఆవిష్కరించిన డాక్టర్ కవ్వంపల్లి

మానకొండూర్ ప్రతినిధి, నవంబర్ 14, :

యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎన్నీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి క్రికెట్ మైదానంలో డిసెంబర్ 3వ తేదీ నుంచి యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి ఎమ్మెల్యే క్రికెట్ కప్ టోర్నమెంట్



పోస్టర్‌ను మంగళవారం ప్రజా భవన్లో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు మంచి వేదిక కల్పించేలా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్రికెట్ కప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్‌లో నియోజకవర్గంలోని యువ క్రికెటర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అట్ల అనిల్ కుమార్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గజ్వేల్ ప్రతినిధి (కుకునూరుపల్లి), నవంబర్ 17, :

డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీసీసీబి బ్యాంక్ మేనేజర్ నిత్యారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్ లు అన్నారు. మంగళవారం కుకునూరుపల్లి మండలం బొబ్బాయిపల్లిలో డీసీసీబి బ్యాంకు అధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిజిటల్ మోసాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంక్ వివరాలను ఎవరికీ చెప్పవద్దని సూచించారు. అలాగే కేవైసీ రీ–కేవైసీ ఆవశ్యకతతో పాటు డిపాజిట్ పథకాలు, బంగారు రుణాలు, లాకర్ సదుపాయాలు, బీమా పథకాల ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు తదితరులు ఉన్నారు

ప్యాకేజీల ప్రతాప్ రెడ్డికి

- కవితను విమర్శించే నైతిక హక్కులేదు
- ప్రతాప్ రెడ్డి చరిత్ర అంతా గజ్వేల్ ప్రజలకు తెలుసు
- మూడు సార్లు పోటీ చేస్తే దివాలా తీయాల్సింది పోయి రూ కోట్లు ఎలా కూడబెట్టావు
- ఆ కిటుకు ఏందో గజ్వేల్ ప్రజలకు చెప్పాలి
- కనీసం వార్డు మెంబర్ గా కూడా గెలవని నువ్వు గజ్వేల్ లో పెత్తనం చెలాయిస్తున్నావు
- హరీష్ రావు అక్రమాలను బయటపెడితే నీకు నొప్పేంటి
- గజ్వేల్ నియోజకవర్గం టీఆర్ఎస్ ఇంచార్జి కొట్టాల యాదగిరి



గజ్వేల్ ప్రతినిధి, నవంబర్ 17, :

ప్యాకేజీల కోసం పార్టీలు మారే వంటేరు ప్రతాప్ రెడ్డి టిఆర్ఎస్ చీఫ్ కవితను విమర్శించడం సిగ్గుచేటని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ ఫైరయ్యారు. మంగళవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతాప్ రెడ్డి ఘనమైన చరిత్ర గజ్వేల్ ప్రజలకు తెలుసని, మూడు దశాబ్దాల క్రితం బోరు బండి నడిపించుకునే ఆయన వందల కోట్లు ఎలా సంపాదించారని నిలదీశారు. మాజీ ఎమ్మెల్యే సంజీవరావును మత్తులో ముంచి సంతకాలు పెట్టించుకున్న ఆయన ప్రభుత్వ పథకాలను పక్కదారి పట్టించినట్లు తెలిపారు. అమాయక ప్రజల నుండి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేయడంతో పాటు అక్రమ రిజిస్ట్రేషన్లు చేసిన మీ కుటుంబ సభ్యులు జైలుకెళ్లడం మర్చిపోయావా అని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో మూడుసార్లు పోటీ చేసిన ఆయన దివాలా తీయాల్సింది పోయి పోటీ చేసిన ప్రతిసారి కోట్లు కూడబెట్టినట్లు తెలిపారు. కనీసం వార్డ్ మెంబర్ గా కూడా గెలవని ప్రతాప్ రెడ్డి పేదలపై పెత్తనం చెలాయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావు అక్రమాలను కవిత బహిర్గతం చేస్తే ప్రతాప్ రెడ్డికి వచ్చిన నొప్పేంటని అన్నారు. ప్రతాప్ రెడ్డి ఏ పార్టీలో కాలుపెట్టిన ఆ పార్టీ భూస్థాపితం అవుతుందని, ఇందుకు గత సంఘటనలు గుర్తు చేశారు. మరోసారి కవితను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ బహిరంగంగా క్షమాపణ చెప్పకుంటే నీ బండారం బయట పెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, నేతలు కూరాకుల శ్రీకాంత్, లింగని రాజు, పాష, లక్ష్మణ్, మిస్బా తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించాలి

పెన్, పన్ను పింఛన్ ఉద్యమానికి పాత్రికేయుల మద్దతు

రెండు కలెక్టరేట్లలో అధికారులకు వినతి



ఖమ్మం జిల్లా ప్రతినిధి, నవంబర్ 17, : విశ్రాంత పాత్రికేయులకు పింఛన్ సౌకర్యం కల్పించాలనే డిమాండ్‌తో ఓ దినపత్రిక యాజమాన్యం చేపట్టిన 'పెన్, పన్ను పింఛన్' ఉద్యమానికి ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పాత్రికేయులు మద్దతు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్వో సీహెచ్ రామ్మూర్తికి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఉమ్మడి జిల్లా బ్యూరో నాగప్రసాద్ నేతృత్వంలో పాత్రికేయ బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంది. జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించి, విశ్రాంత పాత్రికేయుల జీవన భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ప్రభుత్వ కార్యకలాపాలు, ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు తదితర ప్రజాప్రతినిధుల కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ శాఖల సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తూ జర్నలిస్టులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులు తమకు సమస్యలు ఎదురైనప్పుడు తగిన గుర్తింపు, భరోసా పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పని పరిస్థితులు మెరుగుపరచడంతో పాటు వృత్తిపరమైన గౌరవం, సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విశ్రాంత పాత్రికేయులకు పింఛన్ సౌకర్యం కల్పించే అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పత్రిక బూర్గంపాడు మండల రిపోర్టర్ రమేష్, పాల్వంచ టౌన్ రిపోర్టర్ నరహరి, వైరా రిపోర్టర్ కృష్ణ, కొనిజర్ల మండల రిపోర్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

'ఒకే కులం – ఒకే సంఘం' నినాదంతో మున్నూరు కాపులంతా ఐక్యంగా ముందుకు సాగాలి!

- కుల ఐక్యత, సమాజ అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలి – తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్
- రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల నిర్వహణకు 9 మందితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- యాదగిరిగుట్టలో ఎన్నికల సన్నాహక సమావేశం.. 33 జిల్లాలకు సమన్వయకర్తల నియామకానికి తీర్మానం



యాదగిరిగుట్ట ప్రతినిధి, నవంబర్ 17, :

మున్నూరు కాపులందరూ కుల, ప్రాంతీయ విభేదాలకు తావులేకుండా 'ఒకే కులం – ఒకే సంఘం' అనే నినాదంతో ఐక్యంగా ముందుకు సాగాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ పిలుపునిచ్చారు. పదవుల కంటే కుల సేవకే తాను అధిక ప్రాధాన్యత ఇస్తానని, ప్రాణం ఉన్నంతవరకు సమాజ అభ్యున్నతి కోసం ఒక సామాన్య సేవకుడిగా పనిచేస్తానని స్పష్టం చేశారు. యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి మున్నూరు కాపు సత్ర భవనంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లెపల్లి వెంకటేశ్వరరావు, యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి. రాజ్‌కుమార్, ఆర్వీ మహేందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ, మున్నూరు కాపు సమాజం ఐక్యతతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు సంఘం కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో మున్నూరు కాపు భవనాల నిర్మాణానికి ప్రభుత్వం స్థలాలు కేటాయించాలని, పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక హాస్టల్ భవనాలను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాజంలోని ప్రతి ఒక్కరి అభ్యున్నతికి సంఘం ఒక బలమైన వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.

9 మందితో ఎన్నికల కమిటీ ఏర్పాటు

నూతన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు తొమ్మిది మంది సభ్యులతో ప్రత్యేక ఎన్నికల కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు సమన్వయకర్తలను నియమించాలని తీర్మానించారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన యువతీ యువకులందరికీ సంఘంలో సభ్యత్వం కల్పించి, పక్కాగా ఓటర్ల జాబితాను రూపొందించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం త్వరలోనే పూర్తిస్థాయి ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల అధ్యక్షులు, గౌరవాధ్యక్షులతో పాటు గైనని రాజన్, కటకం పెంటయ్య, సుధాకర్ శెట్టి, రంగారావు, శ్రీనివాస్ నాయుడు, పుప్పాల నరసింహ, ఏమిటి రమేష్, నాయక మల్లయ్య, బాలయ్య, పుల్లూరి శోభ, అశోక్, వరాల వేణు, లంక నరసింహ, పుట్ట నరసింహ, పలుగుల శ్రీనివాస్, విశాల్ పటేల్, శ్రీదేవి, రాపర్తి శరత్, సరోజ తదితర రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రతినిధులు, మున్నూరు కాపు కుల బాంధవులు పాల్గొన్నారు.

ధాన్యం వెంటనే కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్
- ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 17, :

ఖరీఫ్ (వానాకాలం) ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించేందుకు జగిత్యాల జిల్లాలో ప్రతిపాదించిన అన్ని కొనుగోలు కేంద్రాలలో పూర్తిస్థాయిలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ వానాకాలం పంట సీజన్‌లో జిల్లావ్యాప్తంగా మొత్తం 438 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. రైతులు ఎఫ్ఏక్యూ ప్రమాణాల మేరకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చిన వెంటనే కొనుగోలు చేసేలా అధికారులు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 30 శాతం పంట కోతలు పూర్తయ్యాయని, ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధర కంటే అధిక ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యంలో తేమ శాతం ఎఫ్ఏక్యూ నిబంధనల పరిధిలో ఉన్నట్లయితే కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అవసరమైన సందర్భాల్లో గోదాములో భద్రపరిచేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ధాన్యాన్ని గోదాములకు తరలించే సమయంలో తేమ శాతం విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు వినియోగించే వాహనాల కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు జీపీఎస్ ట్రాకింగ్ పరికరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ప్రైవేటు కొనుగోళ్ల పై రైతులకు స్వేచ్ఛ కల్పించాలి

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం జిల్లాలో పండించిన ధాన్యంను ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.



రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినప్పుడు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రైవేటు మార్కెట్‌లో రైతులకు మంచి ధర లభిస్తున్నప్పుడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని రైతులపై ఎలాంటి ఒత్తిడి చేయకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు తమ పంటను ఎక్కడ విక్రయించుకోవాలనే విషయంలో పూర్తి స్వేచ్ఛ ఉండాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసునాంబ, సివిల్ సప్లై అధికారులు, డిఏఓ, సిపిఓ, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జంగుభాయి దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరికి ఆత్రం సుగుణక్క వినతి
- మూతపడిన గిరి ఇండస్ట్రీస్‌లను పునరుద్ధరించాలి
- జంగుబాయి ఉత్సవాలకు హాజరుకావాలని మంత్రికి ఆహ్వానం



హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 17, :

తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మంగళవారం హైదరాబాద్‌లో కుమురం భీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఆధ్వర్యంలో పలువురు ఆదివాసీ పెద్దలు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జంగుభాయి దేవాలయాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి, ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. జంగుబాయి ఉత్సవాలకు హాజరుకావాలని మంత్రిని కోరారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో గతంలో ఏర్పాటు చేసిన గిరి ఇండస్ట్రీస్ ప్రస్తుతం కొన్ని మూతపడటంతో వాటిని తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గిరి ఇండస్ట్రీస్‌లో తయారయ్యే చిక్కీలు, సబ్బులు, షాంపూలను ప్రభుత్వమే కొనుగోలు చేసి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించాలని కోరారు. దీంతో గిరిజన ప్రాంతాల్లో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, ఆదివాసీ మహిళలు, యువతకు ఉపాధి లభిస్తుందని, గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించినట్లవుతుందని వివరించారు. గిరిజన ప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి గిరి ఇండస్ట్రీస్ పునరుద్ధరణ ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారి విజ్ఞప్తులపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయిసెంటర్ మేడి మెస్రం దుర్గు, పురుక బాపూరావు, సలాం శ్యామ్ రావు, గిరి ఇండస్ట్రీస్ నిర్వాహకులు, పలువురు ఆదివాసీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక, సిద్దిపేట అభివృద్ధికి రూ.350 కోట్లు కేటాయించాలి

- మల్లన్న సాగర్ భూ బాధితులను సీఎం రేవంత్ రెడ్డి ఆదుకోవాలి
- చేనేత, పద్మశాలి కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ పథకం ఏర్పాటు చేయాలి
- సీఎం రేవంత్ రెడ్డికి బీఎల్ఎఫ్ చైర్మన్ శ్రీరాం రామకృష్ణ ప్రభు లేఖ

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 17, :

తెలంగాణ రాష్ట్రంలోనే దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి ఉందని, రాజకీయ నాయకులు స్వార్థపూరిత రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తున్నారే తప్ప నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించడం లేదని బహుజన లిబరల్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) చైర్మన్ శ్రీరాం రామకృష్ణ ప్రభు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటన సందర్భంగా సిద్దిపేటతో పాటు దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి రూ.350 కోట్లు కేటాయించాలని కోరుతూ ముఖ్యమంత్రికి లేఖ రాశారు. దుబ్బాకలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీఎస్పీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మాచవరం వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. దుబ్బాక చేనేత కళలు అద్భుతమైన నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని, ఈ ప్రాంతంలోని చేనేత, పద్మశాలి కార్మిక కుటుంబాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని ఏర్పాటు చేసి రూ.50 కోట్లు కేటాయించాలని కోరారు. అలాగే దుబ్బాక మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం రూ.80 కోట్లు కేటాయించాలని, నూతనంగా ఏర్పాటైన భూంపల్లి–అక్బర్‌పేట, రాయపోల్, నార్సింగి మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి రూ.65 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మిరుదొడ్డి, చేగుంట మండలాలకు చెరో రూ.10 కోట్ల చొప్పున మొత్తం రూ.20 కోట్లు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల అభివృద్ధికి సంబంధించి అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అవసరమైన నిధులు కేటాయించాలని సూచించారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణం కారణంగా గ్రామాలను కోల్పోయి, జీవనోపాధి దెబ్బతిని ఇబ్బందులు పడుతున్న భూ నిర్వాసితులను ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా గుర్తించాలని కోరారు. బాధిత కుటుంబాలకు తగిన పరిహారం అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు సాగునీరు, నాణ్యమైన విద్యుత్, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు దుబ్బాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని శ్రీరాం రామకృష్ణ ప్రభు ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో సాన తిరుపతి, గుండా శ్రీనివాస్, మల్లేశం, వెంకటేశం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



యోగా లేదా జిమ్..
ఏది బెస్ట్ ఆప్షన్?

శరీరాన్ని ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకుంటే యోగా లేదా వ్యాయామం చేయాల్సిందే.. ప్రస్తుతం ఎక్కువ మంది ఊబకాయం సమస్యతో సతమతమవుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో జిమ్‌లో చెమటలు కక్కుతున్నారు. కొంతమంది వ్యాయామ శిక్షణపై దృష్టి పెడతారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యం కోసం వ్యాయామం అనే శారీరక ప్రక్రియను చేస్తారు. ఇలా చేయడం వలన శారీరకంగానే కాదు మనసికమగా కూడా అనేక ప్రయోజనాలను పొందుతారు.మరోవైపు ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను దూరం చేసుకోవాలనుకునే వారు యోగా, ప్రాణాయామం చేస్తుంటారు. యోగాతో మీరు ఏకాగ్రత నేర్చుకుంటారు. యోగా .. జిమ్ వర్కౌట్‌లలో ఏది బెటర్ అనే ప్రశ్న కొంతమందికి ఎప్పుడూ మనసులో ఉంటుంది. ఈ విషయంపై కల్ట్ ట్రాన్స్‌ఫార్మ్ యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రేల్లా అనేక విషయాలను చెప్పారు. ఆరోగ్యంగా ఉండాలంటే శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవడం చాలా అవసరమని చెబుతున్నారు. దీంతో ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి. అంతేకాదు మన శరీరంలోని కండరాలు కూడా ఫ్లెక్సిబుల్‌గా ఉంటాయి. యోగా, జిమ్ వ్యాయామాల మధ్య వ్యత్యాసం ఉంది. ఈ రెండింటి మధ్య తేడా గురించి ముందుగా చెప్పుకుందాం.

యోగా అంటే ఏమిటి?

యోగా అనేది భౌతిక భంగిమలు, ధ్యానం, లోతైన శ్వాసలతో కూడిన ఒక పురాతన అభ్యాసం. యోగా అనేది శరీరం, మనస్సు, ఆత్మ ఐక్యంగా ఉండే ఆధ్యాత్మిక ప్రక్రియ. ఈ పదం హిందూమతం, జైనమతం, బౌద్ధమతంలో ధ్యాన ప్రక్రియకు సంబంధించినది. యోగా అనేది సంస్కృత పదం యుజ్ నుండి వచ్చింది. అంటే సేకరించడం లేదా బంధించడం. యోగా ఒక ఆధ్యాత్మిక క్రమశిక్షణ. యోగాలో సూర్య నమస్కారంతో సహా అనేక ఆసనాలు, ప్రాణాయామం ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు గణనీయంగా యోగా పట్ల ఆసక్తిని చూపిస్తున్నారు.

జిమ్ వ్యాయామం

జిమ్ గురించి అందరికీ తెలుసు. వ్యాయామశాలలో వివిధ యంత్రాలతో పాటు గాడ్జెట్లను ఉపయోగించి వ్యాయామం చేస్తారు. ఫిట్ , టోన్డ్ బాడీని పొందడానికి చాలా మంది జిమ్‌కి వెళ్తుంటారు. ప్రజలు జిమ్‌కి వెళ్లి కార్డియో, కాళ్లు , వెయిట్ లిఫ్టింగ్ వంటి వివిధ వ్యాయామాలు చేస్తారు.

రెండింటిలో ఏది మంచిది?

రెండు ఆరోగ్యానికి మేలు చేసేవే అని యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రేలా చెబుతున్నారు. యోగాలో శ్వాస నియంత్రణ అంటే ప్రాణయ, ఆసనం .. యోగా నిద్ర వంటి అంశాలు ఉంటాయి. ఇది శరీరం, మనస్సు రెండింటినీ రిలాక్స్ చేస్తుంది. అదే సమయంలో జిమ్ వ్యాయామంలో శక్తి శిక్షణ ఉంటుంది. ఇది జీవక్రియ. కండరాలకు మంచిది. నిపుణుల అభిప్రాయం ప్రకారం మీ శరీర తత్వాన్ని తెలుసుకోండి. మరింత సౌకర్యవంతంగా ఉన్న వాటిని ఆచరించండి.





వెజిటేరియన్స్ ఎక్కువగా ఉన్న దేశాలెంటో తెలుసా

కొంతమంది చిన్నప్పటి నుంచీ మాంసాహారులు అయినప్పటికీ.. కారణాలు ఏమైనా కాలక్రమంలో శాకాహారులుగా మారిపోతున్నారు. ఇంకొంత మంది పుట్టినప్పటి నుంచీ శాకాహారులుగా ఉన్నా తదనంతర కాలంలో మాంసాహారులవుతున్నారని అంటుంటారు. ఏది ఏమైనప్పటికీ.. ఎవరు ఎలా మారినప్పటికీ.. శాకాహారం తినడమా, మాంసాహారం తినడమా అనేది పూర్తిగా వ్యక్తిగత ఎంపికనే చెప్పాలి. అయితే ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా చలా మంది ఇప్పుడు శాకాహారాన్ని అవలంభిస్తున్నారని అంటుంటారు. లైఫ్ స్టైల్ ఛేంజ్ లో భాగంగా ఆహారపు అలవాట్లనూ మారుస్తున్నారు. కొంతమంది హెల్త్ కాన్సియష్ కాస్త ఎక్కువగా ఉండి కూడా ఇలాంటి నిర్ణయాలు చేస్తున్నారని చెబుతుంటారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా శాకాహారుల సంఖ్య పెరుగుతుందని అంటుంటారు.

శాకాహారులు ఎక్కువగా ఉన్న టాప్ - 5 దేశాలు...

భారతదేశం:

అత్యధిక సంఖ్యలో శాకాహారం తినేవారు ఎక్కువగా ఉన్న దేశాల్లో అగ్రస్థానంలో ఉంది భారత్. ఇక్కడ ఉన్న జనాభాలో సుమారు 30శాతం మందికి పైగా ప్రజలు శాకాహారమే తింటారని చెబుతున్నారు. ఈ శతంలో ప్రధాన వాటా హర్యానా, రాజస్థాన్ లలో నివసిస్తున్న ప్రజలని అంటుంటారు!

ఇజ్రాయెల్:

ఇజ్రాయెల్ జనాభాలో సుమారు 13 శాతం మంది ప్రజలు శాకాహారులే. మనిషి తన ఆకలిని తీర్చుకోవడానికి జంతువులను చంపడాన్ని సమర్థించలేమని ఇక్కడ నివసించే కొంతమంది ప్రజానికం బలంగా నమ్ముతారంట.

తైవాన్:

శాఖాహార ఆహారాన్ని భుజించే జనాభా ఎక్కువగా ఉన్న దేశాల్లో తైవాన్ మూడో స్థానంలో ఉంది. ఇక్కడున్న మొత్తం జనాభాలో 12 శాతం మంది ఇక్కడ శాకాహారాన్నే అనుసరిస్తున్నారు. ఇక్కడ వెజ్ రెస్టారెంట్స్ చాలానే ఉన్నాయి.

ఇటలీ:

ఇటలీ జనాభాలో సుమారు 10 శాతం మంది ప్రజలు వెజిటేరియన్స్. వాస్తవానికి ఇటలీ నాన్ వెజ్ వంటకాలకు ఎక్కువ ప్రసిద్ధి చెందినప్పటికీ.. ఇక్కడ శాకాహారుల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోందని తాజా నివేదికలు చెబుతున్నాయి.

ఆస్ట్రియా:

ప్రపంచ వ్యాప్తంగా శాకాహార ఆహారాన్ని అనుసరించే వ్యక్తుల విషయంలో ఆస్ట్రియా ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ సుమారు 9 శాతం మంది.



పరగడపున పనీర్ తింటే.. బోలెడు లాభాలు



చీజ్ అని కూడా పిలువబడే పనీర్, వివిధ రకాల వంటకాలలో ఉపయోగించగల బహుముఖ ప్రయోజనాలు, రుచికరమైన పదార్థం. కానీ., ఉదయాన్నే పనీర్ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని మీకు తెలుసా..? మీ అల్పాహార దినచర్యలో పనీర్ చేర్చడం మీ మొత్తం శ్రేయస్సుకు ప్రయోజనకరంగా ఉండటానికి వివిధ కారణాలను ఒకసారి చూద్దాం.

ప్రోటీన్ పుష్కలంగా:

పనీర్ అధిక నాణ్యత ప్రోటీన్ యొక్క గొప్ప మూలం. ఇది మీ రోజును ప్రారంభించడానికి అనువైన ఆహారంగా మారుతుంది. కణజాలాలను నిర్మించడానికి, మరమ్మతు చేయడానికి, అలాగే ఆరోగ్యకరమైన ఎముకలు, కండరాలు, చర్మాన్ని నిర్వహించడానికి ప్రోటీన్ అవసరం.

జీవక్రియను పెంచుతుంది:

ఉదయాన్నే పనీర్ తినడం ద్వారా, మీరు మీ జీవక్రియను పెంచుకోవచ్చు. వేగవంతమైన జీవక్రియ బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇంకా రోజంతా మీకు మరింత శక్తిని అందిస్తుంది.

మీకు కడుపు నిండుగా అనిపించేలా చేస్తుంది:

పనీర్ అనేది మిమ్మల్ని ఎక్కువ కాలం సంతృప్తిగా, కడుపు నిండుగా ఉండేలా చేయడానికి సహాయపడే ఒక నింపే ఆహారం. ఇది రోజు చివరిలో అనారోగ్యకరమైన ఆహారాలను అతిగా తినడం, అల్పాహారం తీసుకోవడం నివారించవచ్చు.

అవసరమైన పోషకాలను అందిస్తుంది:

పనీర్ కాల్షియం, భాస్వరం, విటమిన్ ఎ, బి 12 వంటి విటమిన్లకు మంచి మూలం. బలమైన ఎముకలు, దంతాలు, మొత్తం రోగనిరోధక శక్తిని నిర్వహించడానికి ఈ పోషకాలు ముఖ్యమైనవి.

రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది:

ఉదయం పనీర్ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది డయాబెటిస్ లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి ముఖ్యమైనది. పనీర్ లోని ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు రక్తప్రవాహంలోకి చక్కెర శోషణను నెమ్మదిస్తాయి.



లక్నో గూటికి సామ్ కర్రన్
ఢిల్లీ జట్టులో భారీ ప్రక్షాళన!


- ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు కీలక మార్పులు
- రూ.2.4 కోట్లకు లక్నోకు సామ్ కర్రన్ బదిలీ
- రాజస్థాన్ రాయల్స్‌కు షమీ, ఎం.సిద్ధార్థ్
- నితీశ్ రాణా, నిస్సాంక, డకెట్‌లకు ఢిల్లీ గుడ్‌బై
- రూ.29 కోట్లతో మినీ వేలానికి ఢిల్లీ సిద్ధమవుతున్నట్లు సమాచారం



న్యూఢిల్లీ, నవంబర్ 17 (చురకలు): ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు అన్ని ఫ్రాంచైజీలు తమ జట్లను సమూలంగా ప్రక్షాళన చేసే పనిలో నిమగ్నమయ్యాయి. ఆటగాళ్ల రిటెన్షన్ గడువు ముగియడంతో ట్రేడింగ్ విండోలో పలు కీలక ఒప్పందాలు, సంచలన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య ఆసక్తికరమైన ట్రేడ్ జరిగింది. రాజస్థాన్ స్టార్ ఆల్‌రౌండర్ సామ్ కర్రన్‌ను తన పాత ధర రూ. 2.4 కోట్లకు లక్నో సూపర్ జెయింట్స్ సొంతం చేసుకుంది. ఇదే క్రమంలో లక్నో నుంచి సీనియర్ పేసర్ మహ్మద్ షమీ (రూ. 8 కోట్లు), ఎడమచేతి వాటం స్పిన్నర్ ఎం. సిద్ధార్థ్ (రూ. 75 లక్షలు) రాజస్థాన్ రాయల్స్ గూటికి చేరారు. లక్నోకు కొత్త బలం.. కెప్టెన్సీ ఆప్షన్‌గా సామ్ కర్రన్:ఐపీఎల్ కెరీర్‌లో ఇప్పటివరకు 59 వికెట్లు పడగొట్టడంతో పాటు 997 పరుగులు సాధించిన సామ్ కర్రన్, 2022 టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌కు వెళ్లిపోవడంతో, కర్రన్ రాక లక్నో మిడిల్ ఆర్డర్‌కు బలాన్నివ్వడమే కాకుండా కెప్టెన్సీ ఆప్షన్‌గానూ ఉపయోగపడనుంది. గత సీజన్‌లో గాయం కారణంగా దూరమైన కర్రన్, 2027 సీజన్‌లో లక్నో తరఫున బ్యాట్, బంతితో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు.

ఢిల్లీ క్యాపిటల్స్ ప్రక్షాళన.. రూ. 29 కోట్ల పర్స్‌తో వేలంలోకి:

మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తమ ఆటగాళ్ల జాబితాలో భారీ మార్పులు చేసింది. గత సీజన్‌లో రాజస్థాన్ నుంచి రూ. 4.2 కోట్లకు ట్రేడింగ్ ద్వారా వచ్చిన నితీశ్ రాణా 9 ఇన్నింగ్స్‌లలో కేవలం 225 పరుగులే చేసి నిరాశపరచడంతో అతడిని వదులుకుంది. అలాగే ఓపెనర్‌గా 10 ఇన్నింగ్స్‌లలో 278 పరుగులు చేసిన పాతుమ్ నిస్సాంకతో పాటు, టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇస్తూ గత సీజన్‌కు దూరమైన బెన్ డకెట్‌ను కూడా ఢిల్లీ రిలీజ్ చేసింది. వీరితో పాటు ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్, అభిషేక్ పోరెల్, కరుణ్ నాయర్ వంటి మరికొందరు ఆటగాళ్లను కూడా ఢిల్లీ వదులుకోవడంతో, రాబోయే మినీ వేలంలో ఆ జట్టు రూ. 29 కోట్ల భారీ పర్స్‌తో బరిలోకి దిగనుంది.ట్రేడింగ్ విండోలో మరిన్ని సంచలనాలు:ఇతర జట్ల విషయానికి వస్తే.. ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు, పంజాబ్ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌కు చెరో రూ. 18 కోట్ల భారీ ధరతో ట్రేడ్ అవ్వడం ఈ సీజన్‌లో అతిపెద్ద సంచలనంగా మారింది. అలాగే చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజం మహేంద్రసింగ్ ధోనీ ఆటగాడిగా ఐపీఎల్‌కు వీడ్కోలు పలికి జట్టు మెంటార్‌గా కొత్త బాధ్యతలు చేపట్టడం క్రీడా వర్గాల్లో విశేషంగా నిలిచింది.



మను భాకర్‌కు అరుదైన గౌరవం

ఐఎస్ఎస్ఎఫ్ అథ్లెట్ల కమిటీకి ఎన్నికైన భారత షూటర్

న్యూఢిల్లీ, నవంబర్ 17 (చురకలు): భారత స్టార్ మహిళా షూటర్ మను భాకర్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) అథ్లెట్ల కమిటీకి ఆమె ఎన్నికయ్యారు. కమిటీలోని రెండు పదవుల కోసం మొత్తం పది మంది క్రీడాకారులు పోటీపడగా, మను భాకర్ ఒక స్థానాన్ని దక్కించుకున్నారు. 2026 నుంచి 2030 వరకు పిస్టల్ విభాగంలో క్రీడాకారుల ప్రతినిధిగా ఆమె బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ విషయాన్ని భారత జాతీయ రైఫిల్ సంఘం (ఎన్ఆర్ఏఐ) వెల్లడించింది. అంతర్జాతీయ షూటింగ్ క్రీడల నిర్వహణ, క్రీడాకారుల సమస్యలు, సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో అథ్లెట్ల అభిప్రాయాలను వినిపించే అవకాశం మను భాకర్‌కు లభించనుంది. భారత షూటింగ్ క్రీడారంగానికి ఇది మరో విశేష గుర్తింపుగా నిలిచింది.

కెరీర్‌లో విరాట్ కోహ్లీ చేసిన అతిపెద్ద తప్పు అదే

- పదేళ్ల తర్వాత పశ్చాత్తాపపడతాడు: కపిల్ దేవ్
- టెస్టు క్రికెట్‌కు కోహ్లీ వీడ్కోలు పలకడంపై భారత దిగ్గజ కెప్టెన్ కీలక వ్యాఖ్యలు
- 25 ఏళ్ల యువ క్రికెటర్‌కు సైతం సవాలు విసరగలిగే అద్భుత ఫిట్‌నెస్ ఉండి కూడా రిటైర్ కావడం సరికాదని అభిప్రాయం
- కోపంతో తప్పుకోవడం కంటే మొహిందర్ అమర్‌నాథ్‌లా పోరాడి తిరిగి జట్టులోకి రావాల్సిందని సూచన



న్యూఢిల్లీ, నవంబర్ 17 (చురకలు): టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంపై భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకోవాలని కోహ్లీ తీసుకున్న నిర్ణయం అతడి కెరీర్‌లో చేసిన అతిపెద్ద తప్పు అని కపిల్ దేవ్ అభిప్రాయపడ్డారు. ఎంతో అద్భుతమైన ఫిట్‌నెస్ ఉన్న విరాట్‌కు టెస్టుల్లో ఇంకా రాణించగల సత్తా పుష్కలంగా ఉందని, తొందరపడి తీసుకున్న ఈ నిర్ణయం పట్ల భవిష్యత్తులో కోహ్లీ తప్పకుండా పశ్చాత్తాపం వ్యక్తం చేస్తాడని ఆయన పేర్కొన్నారు.

కోపంతో రిటైర్ అవ్వడం సరికాదు - కపిల్ దేవ్

ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కపిల్ దేవ్ మాట్లాడుతూ.. "కోహ్లీ టెస్టుల నుంచి రిటైర్ అయి అతిపెద్ద తప్పు చేశాడని నేను అనుకుంటున్నా. ఈ నిర్ణయం తీసుకున్నందుకు పదేళ్ల తర్వాత అతడు కచ్చితంగా పశ్చాత్తాపపడతాడు. అసలు ఆ నిర్ణయం తీసుకోకుండా ఉండాల్సింది. అతడికి ఉన్నంత అద్భుతమైన ఫిట్‌నెస్ మరే ఆటగాడికి లేదు. ఫిట్‌నెస్ విషయంలో 25 ఏళ్ల యువ క్రికెటర్‌కు సైతం కోహ్లీ సవాలు విసరగలడు. కోపంతో రిటైర్ అవ్వడం ఎప్పటికీ సరికాదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మాజీ క్రికెటర్ మొహిందర్ అమర్‌నాథ్‌లా వ్యవహరించాలి. అమర్‌నాథ్‌ను ఎన్నోసార్లు జట్టు నుంచి తొలగించారు. అయినా ఆయన కుంగిపోకుండా తిరిగి జట్టులో చోటు సంపాదించుకుని, తన విషయంలో ఇతరుల అంచనాలు తప్పు అని నిరూపించారు" అని కపిల్ దేవ్ గుర్తుచేశారు.

వన్డేల్లో కొనసాగుతున్న కోహ్లీ ప్రస్థానం

2024లో టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ, ఆ తర్వాత 2025 మే నెలలో టెస్టు క్రికెట్‌కు కూడా రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. 123 టెస్టులు ఆడిన కోహ్లీ 46.85 సగటుతో 9,230 పరుగులు సాధించి సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకున్నాడు. ప్రస్తుతం కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్న కోహ్లీ.. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో 74 పరుగులతో రాణించినప్పటికీ, ఆ తర్వాతి మ్యాచ్‌లలో నిరాశపరిచాడు. అయితే, ఓవరాల్‌గా ఈ ఏడాది వన్డేల్లో 13 ఇన్నింగ్స్‌లు ఆడిన కోహ్లీ 53.17 సగటుతో 638 పరుగులు చేసి నిలకడగా రాణిస్తున్నాడు.



ఐపీఎల్‌కు ధోనీ గుడ్‌బై..

ఇక సీఎస్కే మెంటార్‌గా కొత్త ఇన్నింగ్స్!

చెన్నై, నవంబర్ 17 (చురకలు): భారత క్రికెట్ దిగ్గజం మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్ కెరీర్‌కు వీడ్కోలు పలికినట్లు వార్తలు వెలువడ్డాయి. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) జట్టుకు ఇకపై మెంటార్‌గా వ్యవహరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ధోనీ రిటైర్మెంట్, మెంటార్ బాధ్యతలపై సీఎస్కే సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటన చేసినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ ఐపీఎల్‌లోనూ ఆటగాడిగా తన ప్రయాణాన్ని ముగిస్తే, సీఎస్కే అభిమానులకు ఇది భావోద్వేగ ఘట్టంగా నిలవనుంది. ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా ధోనీ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ 2010, 2011, 2018, 2021, 2023 సీజన్లలో ఐపీఎల్ విజేతగా నిలిచింది. సీఎస్కేపై నిషేధం ఉన్న 2016, 2017 సీజన్లలో రైజింగ్ పుణె సూపర్‌జెయింట్ తరఫున ఆడారు. 2025లో రుతురాజ్ గైక్వాడ్ గాయపడటంతో మరోసారి తాత్కాలికంగా జట్టు నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. ఐపీఎల్‌లో 278 మ్యాచ్‌లు ఆడి 5,439 పరుగులు సాధించిన ధోనీ వికెట్‌కీపర్‌గా 158 క్యాచ్‌లు, 47 స్టంపింగ్స్‌తోనూ తనదైన ముద్ర వేశారు.

సెలక్టర్లు ఎక్కడుంటే.. బంతిని అక్కడికే కొట్టాలి!



ధోనీ సినిమా డైలాగ్‌తో సూర్యకుమార్ సందడి

న్యూఢిల్లీ, నవంబర్ 17 (చురకలు): భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ మళ్లీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో అదరగొడుతున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ముంబై జట్టుకు నాయకత్వం వహిస్తున్న సూర్య వరుసగా రెండు మ్యాచ్‌ల్లో అర్ధశతకాలు బాది సత్తా చాటాడు. హైదరాబాద్‌పై కేవలం 21 బంతుల్లో 60 పరుగులు చేసిన అతడు గుజరాత్‌పై 29 బంతుల్లోనే 82 పరుగులతో చెలరేగాడు. ఫామ్ కోల్పోయి భారత జట్టుకు దూరమైన సూర్య తిరిగి జాతీయ జట్టులో చోటు సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నాడనే చర్చ జరుగుతోంది. హైదరాబాద్‌తో మ్యాచ్ అనంతరం సూర్యకుమార్ మీడియాతో మాట్లాడుతూ తన బ్యాటింగ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మహేంద్రసింగ్ ధోనీ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ' చిత్రంలోని ఓ సంభాషణను గుర్తుచేశాడు. 'సెలక్టర్లు ఎక్కడ కూర్చుంటారో అక్కడికే బంతిని కొట్టాలి' అనే డైలాగ్‌ను ప్రస్తావిస్తూ తాను కూడా అదే తరహాలో ఆడానని చమత్కరించాడు. అయితే సెలక్టర్లకు సందేశం పంపడం తన ఉద్దేశం కాదని, పరుగులు సాధించి ముంబై జట్టును గెలిపించడంపైనే దృష్టి పెట్టానని స్పష్టం చేశాడు. కాగా, హైదరాబాద్‌తో మ్యాచ్‌ను బీసీసీఐ సెలక్టర్ శివసుందర్ దాస్ ప్రత్యక్షంగా వీక్షించారు. సాల్ట్‌లేక్‌లోని జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయ మైదానంలో సూర్య బాదిన ఓ భారీ సిక్సర్ మైదానం బయట పడటం విశేషం. టీ20 క్రికెట్ వినోదంతో కూడుకున్న ఆట అని, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడాలని సూర్య పేర్కొన్నాడు. సాధన సమయంలో ప్రయత్నించిన షాట్లనే మ్యాచ్‌లో ఆడుతున్నానని, తన కృషికి ఫలితం దక్కుతోందని సంతోషం వ్యక్తం చేశాడు. వరుస అర్ధశతకాలతో సూర్య తిరిగి ఫామ్ అందుకోవడం క్రికెట్ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.



సినీ పరిశ్రమలో భయంతో బతకాల్సి వస్తోంది!

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా సంచలన వ్యాఖ్యలు

ముంబై, నవంబర్ 17 (చురకలు): సినీ పరిశ్రమలో హీరోయిన్లు భయంతో బతకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా ఆవేదన వ్యక్తం చేశారు. హీరోలు ఏం చేసినా అభిమానులు పెద్దగా పట్టించుకోరని, కొన్నిసార్లు వారి తప్పులను కూడా సమర్థిస్తారని అన్నారు. అదే హీరోయిన్ల విషయంలో మాత్రం చిన్న పొరపాటును సైతం భూతద్దంలో చూపిస్తూ సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఊర్వశి సినీ పరిశ్రమలో నటీమణులు ఎదుర్కొంటున్న వివక్ష, సామాజిక మాధ్యమాల వేధింపులపై స్పందించారు. హీరోయిన్లు ఎలాంటి తప్పు చేయకపోయినా ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారని, చిన్న విషయాలను కూడా పెద్ద వివాదాలుగా మారుస్తున్నారని ఊర్వశి పేర్కొన్నారు. ఇలాంటి ప్రతికూల ప్రచారం వల్ల ఎంతోమంది నటీమణులు మానసిక ఒత్తిడికి, ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. హీరోలతో పోలిస్తే హీరోయిన్లే విమర్శలకు ఎక్కువగా భయపడాల్సి వస్తోందన్నారు. ప్రేక్షకులను అలరించేందుకు నటీమణులు ఎంతో కష్టపడతారని, వారి కృషిని ప్రశంసించకపోయినా అనవసర విమర్శలతో మనసులను గాయపరచవద్దని కోరారు. సినీ పరిశ్రమతోపాటు సమాజంలోనూ మహిళా నటుల పట్ల ఆలోచనా విధానం మారాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఊర్వశి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.



'బుట్టబొమ్మ' రికార్డు బద్దలు..
ఫోక్ సాంగ్ సెన్సేషన్!

అల్లు అర్జున్ సూపర్‌హిట్ పాటను అధిగమించిన 'రాను బొంబాయికి రాను'



హైదరాబాద్, నవంబర్ 17 (చురకలు): తెలుగు సంగీత ప్రపంచంలో ఓ జానపద గీతం సరికొత్త సంచలనం సృష్టించింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'అల వైకుంఠపురములో' చిత్రంలోని సూపర్‌హిట్ పాట 'బుట్టబొమ్మ' యూట్యూబ్ వీక్షణల రికార్డును 'రాను బొంబాయికి రాను' జానపద గీతం అధిగమించినట్లు సమాచారం. త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'అల వైకుంఠపురములో' చిత్రంలోని 'బుట్టబొమ్మ' పాట 95.5 కోట్లకు పైగా వీక్షణలు సాధించగా, తాజాగా 'రాను బొంబాయికి రాను' పాట 95.7 కోట్లకు పైగా వీక్షణలతో దాన్ని దాటేసింది. రాము రాథోడ్, లిఖిత ఆలపించిన 'రాను బొంబాయికి రాను' పాట 2025 జనవరి 23న విడుదలైంది. విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ తక్కువ సమయంలోనే కోట్లాది వీక్షణలు సొంతం చేసుకుంది. భారీ బడ్జెట్ చిత్రంలోని స్టార్ హీరో పాటను ఓ జానపద గీతం అధిగమించడం సంగీత ప్రియుల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. మరోవైపు దక్షిణాది సినిమా పాటల్లో ధనుష్ నటించిన 'మారి 2' చిత్రంలోని 'రౌడీ బేబీ' సుమారు 177 కోట్ల వీక్షణలతో అగ్రస్థానంలో కొనసాగుతున్నట్లు సమాచారం. జానపద సంగీతానికి పెరుగుతున్న ఆదరణకు 'రాను బొంబాయికి రాను' విజయమే నిదర్శనంగా నిలుస్తోంది.

స్టెప్పులతో అదరగొట్టిన సాయిపల్లవి, శ్రీలీల

ధనుష్ హీరోగా నటించిన 'హ.వీ' సినిమా ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. మమ్ముట్టి, సాయిపల్లవి, శ్రీలీల, రేణు దేశాయ్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ వేడుకలో సాయిపల్లవి, శ్రీలీల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇద్దరూ కలిసి వేదికపై డాన్స్ చేయడంతో అభిమానులు కేరింతలు కొట్టారు. వారి స్టెప్పులకు హీరో ధనుష్ చప్పట్లు కొడుతూ అభినందించారు. ప్రస్తుతం వీరిద్దరి డాన్స్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.







పూజా హెగ్డే గ్రాండ్ రీ-ఎంట్రీ!

నాలుగేళ్ల విరామం తర్వాత తెలుగు సినిమాలపై ఫోకస్



ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన వరుస సినిమాలతో టాప్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే.. కొంతకాలంగా తెలుగు తెరకు దూరంగా ఉంటున్నారు. 2022లో 'ఆచార్య' తర్వాత పూర్తిస్థాయి తెలుగు సినిమాలో కనిపించలేదు. బాలీవుడ్, కోలీవుడ్ చిత్రాలతో బిజీగా గడిపిన ఈ బుట్టబొమ్మ ఇప్పుడు మళ్లీ టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. దుల్కర్ సల్మాన్ హీరోగా రవి నేలకుదిటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'శ్రీ శ్రీ' సినిమాతో పూజా రీఎంట్రీ ఇవ్వనున్నట్లు సమాచారం. మరోవైపు అల్లు అర్జున్-లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమాలోనూ ఆమె పేరు వినిపిస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వరుసగా భారీ ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కించుకుంటున్నారనే ప్రచారంతో పూజా సెకండ్ ఇన్నింగ్స్‌పై ఆసక్తి పెరుగుతోంది. మరి ఈ సినిమాలతో బుట్టబొమ్మ మళ్లీ టాలీవుడ్‌లో తన పూర్వ వైభవాన్ని అందుకుంటుందేమో చూడాలి.

క్యాస్టింగ్ కౌచ్ నిన్నా ఉంది.. నేడూ ఉంది.. రేపూ ఉంటుంది!

సినీ పరిశ్రమలోని వేధింపులపై రమ్యకృష్ణ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబర్ 17 (చురకలు): సినీ పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ వ్యవహారంపై సీనియర్ నటి రమ్యకృష్ణ సంచలన వ్యాఖ్యలు చేశారు. క్యాస్టింగ్ కౌచ్ గతంలో జరిగిందని, ప్రస్తుతం జరుగుతోందని, భవిష్యత్తులోనూ కొనసాగే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో కొనసాగుతున్న రమ్యకృష్ణ తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ అంశంపై స్పందించారు. క్యాస్టింగ్ కౌచ్ అసలు లేదని చెప్పడం వాస్తవాలను కప్పిపుచ్చడమేనని అభిప్రాయపడ్డారు. కాలాన్ని బట్టి వేధింపులు జరిగే విధానం మారుతుందని, బలవంతంగా జరుగుతున్నాయా, పరస్పర అంగీకారంతో జరుగుతున్నాయా అనే అంశాలను వేర్వేరుగా చూడాల్సి ఉంటుందని వివరించారు. అయితే క్యాస్టింగ్ కౌచ్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా సినీ పరిశ్రమనే ఎందుకు వేలెత్తి చూపుతున్నారని రమ్యకృష్ణ ప్రశ్నించారు. సినిమా రంగం అందరి దృష్టిని ఆకర్షించే రంగం కావడంతో ఇక్కడ జరిగే సంఘటనలపైనే ఎక్కువ చర్చ జరుగుతోందన్నారు. వాస్తవానికి లైంగిక వేధింపులు కేవలం సినీ పరిశ్రమకే పరిమితం కాలేదని, ఇతర రంగాల్లోనూ ఇలాంటి సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. మహిళలతోపాటు పురుషులు కూడా వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యను ఒక్క రంగానికి మాత్రమే ఆపాదించడం సరికాదని, అన్ని రంగాల్లోనూ వేధింపులను అరికట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రమ్యకృష్ణ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com